మహబూబ్‌నగర్ వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగుళాంబ గద్వాల / నారాయణపేట

## నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన తేజస్ నంద్‌లాల్ పవార్..

**వనపర్తి ప్రతినిధి,ఫిబ్రవరి 01 ప్రభాతవార్త:** వనపర్తి జిల్లా అభివృద్ధికి జిల్లా అధికారులు ప్రజా ప్రతినిధులు సహాయ సహకారాలు అందించాలని వనపర్తి జిల్లా పాలనాధికారిగా తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. బుధవారం జిల్లా పాలనాధికారి బాధ్యతలు చేపట్టారు. ఆయనకు అదనపు కలెక్టర్ వేణుగోపాల్ స్వాగతం పలికి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలు ప్రజలకు చేరేలా ప్రతి ఒక్క అధికారి కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ పద్మావతి, జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న తేజస్ నంద్ లాల్ పవార్

## ఉత్తమ విద్యను అందించేలా కృషి చేయాలి:కలెక్టర్

**వనపర్తి ప్రతినిధి,ఫిబ్రవరి 01 ప్రభాతవార్త:** ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించి ఉత్తమ విద్యను అందించేందుకు మన ఊరు మన బడి కార్యక్రమం ప్రభుత్వం చేపట్టిందని వనపర్తి జిల్లా పాలనాధికారి తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. బుధవారం జిల్లా కలెక్టర్ ఐడీఓసీ సమావేశం మందిరంలో మన ఊరు మన బడి కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎంపిక చేసిన పాఠశాలలకు టాయిలెట్లు, కిచెన్ షెడ్, డైనింగ్ హాల్, కంపౌండ్ వాల్ తదితర సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ప్రతి విద్యార్థిని పనికి పంపకుండా పాఠశాలలకు పంపేలా అధికారులు, గ్రామస్తులు, ప్రజా ప్రతినిధులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్, ఆర్డీవో పద్మావతి, డీఈఓ రవీందర్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.


మన ఊరు మన బడి పోస్టర్ ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్

## అందరి సహకారంతో జిల్లాను ప్రగతి పథకంలో నడిపించేందుకు కృషి చేస్తా

**మహబూబ్‌నగర్ నూతన జిల్లా కలెక్టర్ జి.రవి**

**మహబూబ్‌నగర్ బ్యూరో,ఫిబ్రవరి 01 ప్రభాతవార్త :** ప్రజా ప్రతినిధులు, అధికారులు, సిబ్బంది ప్రజలందరి సహకారంతో మహబూబ్‌నగర్ జిల్లాను ప్రగతి పథంలో నడిపించేందుకు కృషి చేస్తానని నూతన జిల్లా కలెక్టర్ జి. రవి తెలిపారు. బుధవారం ఆయన మహబూబ్‌నగర్ జిల్లా నూతన కలెక్టర్‌గా పదవి బాధ్యతలను చేపట్టారు. ఈ సందర్భంగా నూతన జిల్లా కలెక్టర్ జి. రవి మాట్లాడుతూ గతంలో తనకున్న అనుభవంతో ప్రభుత్వ ప్రాధాన్య పథకాలను సమర్థవంతంగా అమలు చేసేందుకు కృషి చేస్తానని, అందరి సహకారంతో జిల్లాను ముందుకు నడిపిస్తానని తెలిపారు.తాను మహబూబ్‌నగర్ జిల్లాకు కొత్త అయినప్పటికి,త్వరలోనే జిల్లా గురించి పూర్తిగా తెలుసుకుని గతంలో పని చేసిన జిల్లా కలెక్టర్ల మాదిరిగానే అధికారులు, సిబ్బంది ప్రజా ప్రతినిధుల సహకారం, సమన్వయంతో జిల్లాను ముందుకు నడిపించేందుకు కృషి చేస్తానన్నారు. మహబూబ్‌నగర్ లాంటి జిల్లాలో పని చేసేందుకు అవకాశం కల్పించిన రాష్ట్ర ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి డా. వి. శ్రీనివాస్‌గౌడ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. కాగా మహబూబ్‌నగర్ జిల్లా నూతన కలెక్టర్‌గా పదవి బాధ్యతలు చేపట్టిన జి.రవి (2015) స్వస్థలం మహబూబాబాద్ జిల్లా, మరిపెడ మండలం, ధర్మారం గ్రామం, వరంగల్‌లోని సెయింట్ పీటర్స్ పాఠశాలలో ఎల్‌కెజి నుంచి 5 వ తరగతి వరకు చదివారు. ఆరవ తరగతి నుండి ఇంటర్ వరకు కోరుకొండ సైనిక్ స్కూల్లో విద్యాభ్యాసం చేశారు. వరంగల్ ఆర్‌ఈసి కళాశాలలో బిటెక్ పూర్తి చేసి, ఎపి జెన్కోలో ఇంజనీర్‌గా పని చేశారు. అనంతరం గ్రూప్ 1 ద్వారా ఎంపికై 2008 లో నల్గొండ జిల్లాలో శిక్షణ పొందిన తర్వాత పాల్వంచ, ఆదిలాబాద్, దేవరకొండ ఆర్డీఓగా పని చేశారు. అనంతరం నల్గొండ డిఆర్‌ఓగా పనిచేశారు. జిల్లాల విభజన తర్వాత యాదాద్రి భువనగిరి జిల్లా జాయింట్ కలెక్టర్‌గా, హైదరాబాద్ జాయింట్ కలెక్టర్‌గా పని చేస్తూనే హైద్రాబాద్ ఇంఛార్జిజిల్లా కలెక్టర్‌గా కూడా పని చేశారు. జగిత్యాల జిల్లా కలెక్టర్‌గా మూడు సంవత్సరాలు పని చేసిన తర్వాత మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్‌గా బుధవారం ఆయన పదవి బాధ్యతలను చేపట్టారు. మహబూబ్‌నగర్ జిల్లా నూతన కలెక్టర్‌గా పదవి బాధ్యతలు స్వీకరించిన జిల్లా కలెక్టర్ ఇ.రవికి రెవెన్యూ అదనపు కలెక్టర్ కె. సీతారామారావు, పలువురు జిల్లా అధికారులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు, జిల్లా కలెక్టర్‌ను కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి ఉద్యోగం పలికారు.


జిల్లా నూతన కలెక్టర్‌గా పదవి బాధ్యతలు స్వీకరిస్తున్న జి. రవి

# మన-ఊరు.. మనబడితో...
# కార్పోరేట్ విద్య..!

**నిరాదరణకు గురైన పాఠశాలలకు పునర్వైభవం**
**మన ఊరు మనబడి పథకానికి రూ. 7,289 కోట్ల నిధులు**
**హన్వాడలో ప్రాథమిక పాఠశాల ప్రారంభోత్సవంలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్**

**మహబూబ్‌నగర్ బ్యూరో,ఫిబ్రవరి 01 ప్రభాతవార్త :** ఉమ్మడి రాష్ట్రంలో తీవ్ర నిరాదరణకు గురైన ప్రభుత్వ పాఠశాలలను అద్భుతంగా తీర్చిదిద్దేందుకు సీఎం కెసిఆర్ ప్రవేశపెట్టిన పథకం మన ఊరు మనబడి అని రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి డా. వి.శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. మన ఊరు మనబడి కార్యక్రమంతో కార్పోరేట్ స్థాయిలో పాఠశాలలను ముస్తాబు చేస్తున్నామని ఆయన అన్నారు. ఇందుకోసం మన ఊరు మనబడి పథకానికి సీఎం కెసిఆర్ రూ. 7,289 కోట్ల నిధుల్ని కేటాయించారని మంత్రి తెలిపారు. హన్వాడ మండల కేంద్రంలో రూ. 52.97 లక్షలతో మన ఊరు మనబడి పథకం కింద నిర్మించిన మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను బుధవారం మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వ బడుల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అధునాతన వసతులు కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. దశల వారిగా డిజిటల్ విద్యావిధానాన్ని ప్రవేశపెట్టి, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాన్ని పెంచాలని ప్రభుత్వం భావిస్తుందన్నారు. నీటి సౌకర్యంతో పాటు టాయిలెట్లు, విద్యుద్దీకరణ, తాగునీటి సరఫరా, విద్యార్థులు సిబ్బందికి సరిపడే ఫర్నిచర్ అందించడం, పాఠశాలలు మొత్తం నవీకరించడం, మరమ్మతులు చేయడం, కిచెన్లు ఏర్పాటు, శిథిలమైన గదుల స్థానంలో కొత్త క్లాస్ రూంలు ఏర్పాటు చేయడం, డిజిటల్ విద్యవంటి వాటిని అమలు చేసి ప్రభుత్వ విద్యా విధానం రూపురేఖలే మార్చివేయనున్నట్లు మంత్రి వివరించారు. ఒకప్పుడు ఎంతో వెనుకబడిన హన్వాడ మండలాన్ని ప్రస్తుతం అన్ని రంగాల్లో అభివృద్ధి చేశామని అన్నారు. హన్వాడ మండలంలో గతంలో ఉన్న బిసి బాలికల గురుకులానికి అదనంగా మరో బిసి బాలికల గురుకులాన్ని కేవలం 15 రోజుల్లో మంజూరు చేయించామని మంత్రి తెలిపారు. ఎస్సీ బాలికల గురుకులంతో పాటు కెజిబివి ఏర్పాటుతో బాలికల విద్యకు ముందడుగు పండిదని పేర్కొన్నారు. పోటీ పరీక్షల ద్వారా కష్టపడి ఉద్యోగాలు సాధించిన ప్రభుత్వ ఉపాధ్యాయుల మార్గదర్శకత్వంలో ప్రైవేట్ స్కూళ్ల కంటే ప్రభుత్వ బడుల్లోనే అద్భుతమైన విద్య అందుతుందన్నారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును పూర్తి చేసి హన్వాడ మండలాన్ని సస్యశ్యామలం చేస్తామని మంత్రి తెలిపారు.


జిమ్‌ను ప్రారంభించి జిమ్ చేస్తున్న మంత్రి


జిమ్‌ను ప్రారంభించి జిమ్ చేస్తున్న మంత్రి


మండల ప్రాథమిక పాఠశాలను ప్రారంభిస్తున్న మంత్రి

**ఓపెన్ జిమ్, రైతు బజార్ ప్రారంభం...**

అంతకు ముందు హన్వాడ మండల కేంద్రంలో రూ. 25 లక్షలతో నిర్మించిన ఓపెన్ జిమ్, రూ. 60 లక్షలతో నిర్మించిన రైతుబజార్ (వెజ్ అండ్ నాన్‌వెజ్ మార్కెట్)ను మంత్రి డా.వి. శ్రీనివాస్‌గౌడ్ ప్రారంభించారు. కార్యక్రమంలో జడ్పీ ఛైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి యాదయ్య, ఆర్డీఓ అనిల్‌కుమార్, ఎంపిపి బాలరాజు, జడ్పీటిసి విజయలక్ష్మి,రమణారెడ్డి,సింగిల్ విండో ఛైర్మన్ వెంకటయ్య, రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు రాజు యాదవ్, టిఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కరుణాకర్‌గౌడ్, సర్పంచ్ రేవతి, సింగిల్ విండో వైస్ ఛైర్మన్ కృష్ణయ్యగౌడ్, ఎంపిడిఓ ధనుంజయ, తహసిల్దార్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

# జనాకర్షక బడ్జెట్..!

వేతనజీవులకు ఊరటనిస్తూ , మహిళలకు ప్రత్యేక పథకాలను ప్రకటిస్తూ.. రైతులకు తీపి కబురును అందిస్తూ..ఇండ్లు కొనే వారికి శుభవార్త చెబుతూ..సామాన్యుడికి ఉపశమనం కలిగేలా పన్నుల శ్లాబులు తగ్గిస్తూ పర్యాటకానికి ఊతం ఇస్తూ జనాకర్షక బడ్జెట్‌గా నిలిచింది. 2023–24 సంవత్సరానికి గానూ కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలాసీతారామన్ బుధవారం ప్రవేశపెట్టిన బడ్జెట్ ఆశాజనకంగా ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



- **వేతన జీవులకు ఊరట**
- **రైతులు, మహిళలకు ప్రత్యేక ప్యాకేజీలు**
- **భారీగా తగ్గనున్న టీవీలు ఎలక్ట్రానిక్ వస్తువుల ధరలు**
- **పెరగనున్న సిగరేట్,బ్రాండెడ్ దుస్తులు**

**మహబూబ్‌నగర్ ప్రతినిధి, ఫిబ్రవరి 1, ప్రభాతవార్త:** కేంద్రం వార్షిక బడ్జెట్‌పై భిన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. 2024లో లోక్ సభ ఎన్నికలు జరగనుండగా అందరి చూపు బడ్జెట్‌పైనే ఉన్నది. ఈ క్రమంలో ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌పై సర్వత్రా ఆసక్తి నెలకొన్నది. ఏఏ ధరలు పెరనున్నాయి, ఏవీ తగ్గనున్నాయి అనే వాటిపై అందరి దృష్టి ఉన్నది. వంటగది గ్యాస్ ధరలు పెరగనుండగా, బంగారం వెండి నగల ధరలు తగ్గనున్నాయి. సిగరేట్లు ఖరీదుగా మారనున్నాయి.

**రూ.3లక్షల వరకు నో ట్యాక్స్..**

ఆదాయం పన్ను పరిమితిని పెంచింది కేంద్రం. గతంలో ఉన్న రూ.5లక్షలను రూ.7లక్షలకు పెంచింది. గతంలో 2020లో ప్రకటించచిన 6స్లాబుల విధానంలో మార్పు చేస్తూ 5స్లాబుల విధానాన్ని అమలు చేస్తున్నట్లు ప్రకటించింది. రూ.3లక్షలలోపు ఆదయం ఉన్నవారు పన్ను చెల్లించాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది.

**రైల్వేకు పెద్దపీట..**

రైల్వేకు దేశ చరిత్రలోనే భారీ బడ్జెట్ కేటాయించింది నిర్మలమ్మ పద్దు. రూ.2.40లక్షల కోట్లు కేటాయిస్తున్నట్లు బడ్జెట్‌లో ప్రకటించింది కేంద్రం. 100 కొత్త పథకాలను ప్రారంభిస్తున్నట్లు ప్రకటించడంతో ఉమ్మడి పాలమూరు జిల్లాకు కొత్త పథకాల్లో అవకాశం లభించనున్నట్లు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. పాత పథకాలకు కూడా రూ.75 కోట్లు కేటాయించడంతో పెండింగ్ రైల్వే లైన్లకు మోక్షం ఏర్పడనున్నది. కొత్త లైన్లకు కూడా మంత్రి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.

**పీఎం ఆవాస్ యోజన..**

పీఎం ఆవాస్ యోజన కింద భారీగా కేటాయింపులు చేశారు. రూ.79వేల కోట్లతో పేదలకు ఇండ్లు నిర్మించేందుకు కేటాయించగా, ఇల్లు లేని పేదలు ఉండొద్దనే లక్ష్యంతో ముందుకెళ్తున్నట్లు ప్రకటించారు. అదేవిధంగా మత్స్య సంపద యోజనకు అదనంగా రూ.6వేల కేటాయించడంతో మత్స్యకారులు హర్షం చేస్తున్నారు.

**విద్యావ్యవస్థకు..**

కేంద్ర విశ్వవిద్యాలయాలు, మెడికల్ కళాశాలలు, ఉపాధ్యాయుల నియామకాలకు కూడా బడ్జెట్‌లో కేటాయింపులు జరిపారు. 38వేల ఉపాధ్యాయ పోస్టుల భర్తీతోపాటు, 157 మెడికల్, నర్సింగ్ కళాశాలలకు ఏర్పాటుకు మార్గం సుగమం కానున్నది.

**విద్యారంగంలో వినూత్న చర్యలు..**



3.5లక్షల గిరిజన విద్యార్థులకు సేవలందించే 749 ఏకలవ్య పాఠశాలలకు ఉపాధ్యాయులను నియమించేందుకు కేటాయింపులు జరపడం సంతోషం. కృత్రిమ మేధస్సుకు మూడు కేంద్రాలను కేటాయించడాన్ని స్వాగతిస్తున్నాం. జాతీయ డిజిటల్ లైబ్రరీతో భౌగోళిక విషయాలు, భాషలు,నాణ్యమైన పుస్తలకాలు అందుతాయి. ఇంజినీరింగ్ సంస్థల్లో 5జీ సేవలతో అప్లికేషన్‌ను అభివృద్ధి చేస్తాయి.

**– అర్జున్ కుమార్, హెచ్‌వోడీ, పీయూ కామర్స్ డాపార్ట్‌మెంట్**

**పాలమూరుకు అన్యాయం**



తెలంగాణకు ముఖ్యంగా పాలమూరుకు అన్యాయం జరిగింది. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు ఎలాంటి కేటాయింపులు జరపలేదు. జాతీయ హోదా ప్రస్తావన లేదు. తెలంగాణ ప్రాజెక్టులకు కేటాయింపులు జరపాలి. యువతకు ఉద్యోగ కల్పనపై ఎలాంటి ప్రస్తావన లేదు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి.

**– మండడి సరోజ్ రెడ్డి,వైఎస్‌ఆర్ తెలంగాణ పార్టీ జిల్లా అధ్యక్షుడు**

**మహిళా సాధికారత దిశగా..**



పేదలు, మధ్యతరగతి వారికి మేలు చేసేలా ఉన్నది బడ్జెట్. మహిళా సాధికారత దిశగా బీజేపీ ప్రభుత్వం అడుగులు వేస్తున్నది. మహిళలు, బాలికలల కోసం మహిళ సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్‌ను తీసుకొచ్చారు. రైతులకు సైతం భారీ కేటాయింపులు జరిపి రైతు సంక్షేమానికి కృషి చేస్తున్నది. సామాన్యుల ఇంటి కలను సాకారం చేసుకునేలా పీఎం ఆవాస్ యోజన పథకానికి భారీగా కేటాయింపులు జరిపారు. సకల జనులకు సమ్మతమైన బడ్జెట్ ఇది.

**– వీరబ్రహ్మాచారి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు, మహబూబ్‌నగర్**

**తెలంగాణకు అన్యాయం**



బడ్జెట్ చాలా గందరగోళంగా ఉన్నది. ఉద్యోగ భద్రత లేదు. నిరుద్యోగుల ఊసే లేదు. కార్పోరేట్‌కు కొమ్ము కాస్తున్నట్లు కేటాయింపులు ఉన్నాయి. మధ్య తరగతి వాళ్ల పన్ను కట్టే పరిస్థితి ఉన్నది. మహబూబ్‌నగర్‌కు ప్రత్యేక కేటాయింపులు ఏమీ లేవు. రైతులు నిరాశతో ఉన్నారు. వ్యవసాయానికి కేటాయింపులు లేవు. వారు మాట్లాడేది వేరు..చెప్పేది వేరు .. చేసేది వేరు. మాటలకు చేష్టలకు పొంతన లేదు.

**– జి మధుసూదన్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు, మహబూబ్‌నగర్**

## పేలుడు పదార్థాలు విక్రయిస్తే కఠిన చర్యలు..

**- అనుమతి లేకుండా అక్రమంగా నిల్వ చేసినా కేసులు నమోదు చేస్తాం: మహబూబ్‌నగర్ ఎస్పీ నరసింహ**

**మహబూబ్‌నగర్ ప్రతినిధి, ఫిబ్రవరి1, ప్రభాతవార్త:** అనుమతి లేకుండా పేలుడు పదార్థాలు రవాణా చేసినా, నిల్వ చేసినా చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఎస్పీ నరసింహ తెలిపారు. జడ్చర్ల మండల కేంద్రంలోని విజయనగర్ కాలనీలో మంగళవారం భారీగా పట్టుబడ్డ పేలుడు పదార్థాల కేసు వివరాలను ఎస్పీ బుధవారం జడ్చర్ల పోలీస్ స్టేషన్‌లో మీడియా సమావేశం వెల్లడించారు. వివరాల్లోకి వెళ్తే.. కాలనీలో బాలయ్య అనే వ్యక్తి గుడిసెలో అనుమానాస్పదంగా పేలుడు పదార్థాలు ఉన్నాయన్న సమాచారం మేరకు అనుమానంతో తనిఖీలు జడ్చర్ల పోలీసులు, టాస్క్ ఫోర్స్ బృందం తనిఖీలు మంగళవారం తనిఖీలు నిర్వహించగా 2075 డిటోనేటర్స్, 2074 జిలెటిన్ స్టిక్స్ పట్టుబడినట్లు తెలిపారు. మిద్దె రాజేశ్ అనే వ్యక్తి సోమయ్య, మల్లేశ్, గణేశ్ అనే వ్యక్తుల నుంచి అక్రమంగా పేలుడు పదార్థాలు తీసుకొచ్చి జడ్చర్ల ప్రాంతంలో విక్రయిస్తున్నట్లు తెలిసింది. మిద్దె రాజేశ్ ముందు నుంచి సోమయ్య, మల్లేశ్ వద్ద పనిచేసేవాడు. వారు చెప్పిన ప్రాంతాలకు పేలుడు పదార్థాలు ఎగుమతి చేసేవాడు. ఈక్రమంలో గణేశ్ అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. వ్యాపారం బాగుందని, లాభాలు బాగా ఉన్నాయని అతను పేలుడు పదార్థాలు విక్రయించాలనుకున్నాడు. వ్యక్తిగతంగా ఇతను కూడా పేలుడు పదార్థాలు అమ్ముతున్నాడన్న సమాచారం మేరకు పోలీసులు తనిఖీ నిర్వహించగా పేలుడు పదార్థాలు పట్టుబడ్డాయి. పేలుడు పదార్థాల రావాణా, విక్రయం కానీ నేరం కాబట్టి చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటాం. ఐపీసీ సెక్షన్ 386 ప్రకారం 4,5 ప్రకారం మిద్దె రాజేశ్, సోమయ్యను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. పరారీలో ఉన్న రమేశ్, గణేశ్‌లను పట్టుకుని చట్టరీత్యా చర్యల తీసుకుంటామన్నారు. ఇప్పటికే వీరిపై వివిధ కేసులు నమోదు అయినట్లు వెల్లడించారు. ఈమేరకు చాకచక్యంగా వ్యవహరించి నిందితులను పట్టుకున్న సీఐ రమేశ్‌బాబు,ఎస్సై లెనిన్, వెంకటేశ్వర్లు, ఏఎస్సై లక్ష్మణ్, టాస్క్ ఫోర్స్ సిబ్బందిని ఎస్పీ అభినందించారు. పోలీస్ శాఖ తరఫున తగిన రివార్డు కూడా అందజేస్తామన్నారు.


విలేకరులతో వెల్లడిస్తున్న ఎస్పీ నరసింహ

# మహబూబ్‌నగర్ వైద్య రంగంలో పెనుమార్పులు...

**హైదరాబాద్ లాంటి నగరాలకు వెళ్లకుండా ఇక్కడే సూపర్ స్పెషాలిటీ వైద్యం అందిస్తాం**
**రాష్ట్ర ఎక్సైజ్ మంత్రి డా.వి. శ్రీనివాస్‌గౌడ్**

**మహబూబ్‌నగర్ బ్యూరో,ఫిబ్రవరి 01 ప్రభాతవార్త :** మహబూబ్‌నగర్ జిల్లాలోనే అన్ని రకాల వైద్య సదుపాయాలు కల్పించి ఇక్కడి ప్రజలకు ఇక్కడే సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలను అందజేస్తామని రాష్ట్ర ఎక్సైజ్‌శాఖమంత్రి డా.వి. శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. బుధవారం ఆయన జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన నర్సింగ్ కళాశాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గతంలో ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో ఎలాంటి సదుపాయాలు ఉండేవి కాదని, అలాంటిది కోవిడ్ సమయంలో ఇతర ప్రాంతాల నుంచి మహబూబ్‌నగర్ ఆసుపత్రికి వచ్చి వైద్యం చేయించుకున్న ఉదాహరణలు ఉన్నాయని తెలిపారు. జిల్లాకు మెడికల్ కళాశాల మంజూరుతో పాటు, నర్సింగ్ కళాశాల వచ్చిందని, ఫిజియోథెరపి కళాశాలకు కూడా త్వరలో రాబోతున్నదని, బీఎస్సీ నర్సింగ్ నాలుగు సంవత్సరాల కోర్సు రావడం సంతోషమని తెలిపారు. వైద్య వృత్తిలో డాక్టర్ తర్వాత అత్యున్నత సేవలు అందించేది నర్సులు మాత్రమేనని ఆయన పేర్కొన్నారు. రోగి ప్రాణాలు కాపాడడంలో నర్సులు ఎనలేని పాత్ర పోషిస్తారని అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలో 4,5 డిగ్రీ కళాశాలలతో పాటు 10 జూనియర్ కళాశాలలు, మెడికల్ కళాశాల, నర్సింగ్, ఫిజియోథెరపి వంటి కళాశాలలు వచ్చాయని, ఇకపై ప్రజలు హైదరాబాద్ వెళ్లాల్సిన అవసరం లేదని, ఇక్కడే వైద్యం చేయించుకోవచ్చని, వచ్చే సంవత్సరం నాటికి పాత కలెక్టరేట్ స్థానంలో 500ల కోట్లతో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని ప్రారంభిస్తామని మంత్రి తెలిపారు. నర్సింగ్ కళాశాలలో విద్యార్థులకు మంచి విద్యతో పాటు, నాణ్యమైన భోజనం ఏర్పాటు చేయాలని, సంవత్సరం నాటికి నర్సింగ్ కళాశాలకు భవనాన్ని నిర్మిస్తామని తెలిపారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని అన్ని జిల్లాలకు మెడికల్ కళాశాలలు రానున్నాయని, దేశంలోనే మూడు మెడికల్ కళాశాలలో ఉన్న ఏకైక జిల్లా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అని తెలిపారు. జిల్లాలో వైద్య రంగంలో పెనుమార్పులు వచ్చాయని, 2014కు ప్రస్తుతం ఉన్న పరిస్థితులను ప్రజలు బేరీజు వేసుకోవాలని తెలిపారు. ప్రజల ప్రాణాలను కాపాడడమే ధ్యేయంగా పని చేస్తున్నామని, డాక్టర్లు, వైద్య సిబ్బంది బాగా కష్టపడి పనిచేసి మంచి వైద్యం పేదలకు అందిస్తామన్న భరోసా కల్పించాలని ఆయన కోరారు. బాగా పని చేసిన వైద్యులను, సిబ్బంది సేవలను గుర్తిస్తామని ఈ సందర్భంగా మంత్రి వెల్లడించారు. మున్సిపల్ ఛైర్మన్ కెసి నర్సింహులు, జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు రాజేశ్వర్‌గౌడ్, మెడికల్ కళాశాల డైరెక్టర్ రమేష్, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ స్వరాజ్యలక్ష్మి, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డా. కృష్ణ, ఉప వైద్యాధికారి డా. భాస్కర్‌నాయక్, డా. జీవన్, వార్డు కౌన్సిలర్, ఆసుపత్రి డెవలప్‌మెంట్ కమిటి సభ్యులు లక్ష్మి, సత్యనారాయణ పాల్గొన్నారు.


నర్సింగ్ కళాశాలను ప్రారంభిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్


కళాశాల విద్యార్థులతో మాట్లాడుతున్న మంత్రి



కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి

## సమాజాభివృద్ధిలో జర్నలిస్టుల పాత్ర ఎంతో కీలకం...

**సర్పంచ్ యెన్నం భూపతిరెడ్డి, తహసీల్దార్ చంద్రశేఖర్**

**వెల్దండ, ఫిబ్రవరి 01 ప్రభాతవార్త:**సమాజాభివృద్ధిలో జర్నలిస్టుల పా త్ర ఎంతో కీలకమని వెల్దండ మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, వెల్దండ గ్రామ సర్పంచ్ యెన్నం భూపతిరెడ్డి, తహసీల్దార్ చంద్రశేఖర్‌లు అన్నారు. బుధవారం వెల్దండ మండల కేంద్రంలోని బ్రహ్మగిరి దేవాలయంలో టీయూడబ్ల్యూజే 143 జర్నలిస్టు యూనియన్ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ద్వితీయ మహాసభల గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా



ఉంటూ సమాజాభివృద్ధి కోసం జర్నలిస్టులు చేస్తున్న కృషి ఎంతో అమోఘమన్నారు. ఈ నెల 5న నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని రుబి గార్డెన్‌లో నిర్వహించే జిల్లా మహాసభలకు జర్నలిస్టులు అధిక సంఖ్యలో తరలివెళ్లి విజయవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే 143 జిల్లా నాయకులు నాగరాజుగౌడ్, డీటీ శ్రీనివాస్, సింగిల్‌విండో డైరెక్టర్ శేఖర్ ముదిరాజ్, రేషన్ డీలర్ల సంఘం మండల అధ్యక్షులు జంగయ్య, రెడ్డి సేవా సమితి మండల అధ్యక్షులు వై.కృష్ణారెడ్డి, ఉప సర్పంచ్ నర్సింహ్మా ముదిరాజ్, కాంగ్రెస్ నాయకులు శేఖర్, పుల్లయ్య, ఆర్యవైశ్య మహాసభ మండల అధ్యక్షులు పుల్లయ్య, కృష్ణ ముదిరాజ్, సమీర్ అహ్మెద్ జర్నలిస్టులు తదితరులు ఉన్నారు.

## ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరం

**రాజాపూర్ సర్పంచ్ బచ్చిరెడ్డి**

**రాజాపూర్,ఫిబ్రవరి01 ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి సహాయనిధి నిరుపేదలకు ఎంతో వరం లాంటిదని రాజాపూర్ సర్పంచ్, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షులు బచ్చిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం రాజాపూర్ మండల కేంద్రానికి చెందిన వనపర్తి యాదగిరికి రూ. 60 వేలు, కుమ్మరి పద్మమ్మ రూ. 15 వేలు ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ఆదేశాల మేంకు సర్పంచ్ బచ్చిరెడ్డి చేతుల మీదుగా చెక్కు



లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి వనపర్తి నరహరి, బిఆర్ఎస్ పార్టీ ఉపాధ్యక్షులు రాచమళ్ల యాదగిరి, వార్డు మెంబర్ దస్తగిరి, భీమగల్ల నర్సింలు, మల్లేష్, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి..

**ఉపాధ్యాయ శాసనమండలి అభ్యర్థి గుర్రం చెన్నకేశవరెడ్డి**

**మహ్మదాబాద్,ఫిబ్రవరి 01 ప్రభాతవార్త :** ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పిఆర్‌టియు టిఎస్ ఉపాధ్యాయ శాసనమండలి అభ్యర్థి గుర్రం చెన్నకేశవరెడ్డి తెలిపారు. శాసనమండలి ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం మహ్మదాబాద్ మండల కేంద్రంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిఆర్‌సి విషయంలో కావచ్చు, నిన్న వెలువడిన ఉపాధ్యాయుల పదోన్నతు



లు, బదిలీల షెడ్యూల్ విషయంలో కావచ్చు, ముందు చెప్పిన జోఓలు తెచ్చిన మన పిఆర్‌టియు టిఎస్ ఈ సందర్భంగా పదోన్నతుల షెడ్యూల్ ప్రకటించిన ముఖ్యమంత్రి కెటిఆర్, సబితా ఇంద్రారెడ్డి సంఘ పక్షాన ధన్యవాదాలు తెలియజేశారు. అదే విధంగా కనీస స్టాండింగ్‌ను రెండు సంవత్సరాల నిబంధనలు తొలగించి 317 ఉపాధ్యాయులు కూడా ఈ బదిలీలలో అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. జూన్ నాటికి ఉపాధ్యాయ ఉద్యోగ వర్గానికి నగదు రహిత హెల్త్ కార్డులు పూర్తి స్థాయిలో వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎందుకని ఉపాధ్యాయుల నుండి 1 శాతం బేసిక్ పెయిన్ ఇవ్వడానికి అంగీకారం తెలిపినట్లు అన్నారు. రానున్న రోజుల్లో సిపిఎస్ విధానాన్ని తొలగించి పాత పెన్షన్ స్కీం వర్తింపజేసే బాధ్యత పిఆర్‌టియు టిఎస్ సంఘానికి అన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు కె. విజయ ఆనంద్‌రెడ్డి, పత్రికా సంపాదకులు కృష్ణారెడ్డి, జిల్లా గౌరవాధ్యక్షులు గోపాల్ నాయక్, అసోసియేట్ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు జనార్ధన్, మాజీరాష్ట్ర బాధ్యులు నర్సిరెడ్డి, గోపాల్‌గౌడ్, రాష్ట్ర, జిల్లా మండల బాధ్యులు హరికృష్ణ, రామకృష్ణారెడ్డి, నరసింహులు, హనుమంతు, శ్రీధర్, నరెందర్, విజయభాస్కర్‌రెడ్డి, బాలరాజు, భీంరెడ్డి, ప్రాథమిక సభ్యులు పాల్గొన్నారు.

## తిమ్మినోనిపల్లికి బీటీ రోడ్డు సౌకర్యం కల్పించాలని ఎమ్మెల్యేకు వినతి

**వెల్దండ, ఫిబ్రవరి 01 ప్రభాతవార్త:**వెల్దండ మండల పరిధిలోని తిమ్మినోనిపల్లి గ్రామానికి సరైన రోడ్డు సౌకర్యం లేక ప్రజలు, విద్యార్థులు, వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, మండల కేంద్రంలో ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌కు బుధవారం గ్రామస్తులు చింతల యాదగిరిరెడ్డి, రాజులు వినతి పత్రం అందించారు. దీంతో పాటు గ్రామానికి వచ్చే ప్రధాన రహదారిని రియల్ వ్యాపారులు అక్రమంగా



ఆక్రమించుకోవడానికి ప్రయత్నిస్తున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులు సర్వే చేపట్టి ఆక్రమణకు రోడ్డు గురికాకుండా చూసుకోవాలన్నారు. వినతి పత్రం అందించిన వారిలో జంగారెడ్డి, జహంగీర్, మల్లేష్‌తో పాటు తదితరులు ఉన్నారు.

## కొనసాగుతున్న కంటి వెలుగు శిబిరం

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఫిబ్రవరి 01 ప్రభాతవార్త:**జనవరి 18న ప్రారంభమైన రెండవ విడత కంటి వెలుగు కార్యక్రమం నాగర్‌కర్నూల్ జిల్లాలో నిర్విరామంగా కొనసాగుతోంది. ఇప్పటి వరకు జిల్లాలో మొత్తం 66893 మంది కి కంటి పరీక్షలు నిర్వహించామని వైద్య బృందం సూచించారు. ఇందులో దగ్గరి చూపు కంటి అద్దాలు అవసరమైన 10822 మందిని గుర్తించి ఎప్పటికప్పుడు అద్దాలు అందించామన్నారు. దూరపు చూపు సమస్య ఉన్న వారు 7657 గుర్తించామని, ఇందులో 4841 మందికి



దూరపు చూపు కంటి అద్దాలకు ఆన్‌లైన్ ద్వారా ఆర్డర్ చేశామన్నారు. ఆర్డర్ ఇచ్చిన కంటి అద్దాలు రాగానే ఎవ్వరి అద్దాలను వారికి క్యూ ఆర్ కోడ్ ద్వారా అందిస్తామన్నారు.

## మలబార్ గోల్డ్ సహాయాన్ని మరిచిపోవద్దు...

**విద్యార్థులు ఉన్నత స్థానాల్లో రాణించాలి...**

**కల్వకుర్తి, ఫిబ్రవరి 01 ప్రభాతవార్త:**కల్వకుర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మలబార్ గోల్డ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 200 మంది విద్యార్థులకు రూ.16లక్షల చెక్కులను ప్రిన్సిపాల్ సురేందర్‌రెడ్డి అధ్యక్షతన పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ప్రజా కవి, ఎమ్మెల్సీ గోరేటి వెంకన్న, కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, నాగర్‌కర్నూల్ జిల్లా విద్యాధికారి వెంకటరమణ, మలబార్ గోల్డ్ ట్రస్ట్ చైర్మన్ జిశాన్, అజిత్‌లు హాజరై విద్యార్థులకు చెక్కులను



అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న పేదింటి బాలిక విద్యార్థినులను ఆర్థికంగా అండదండలు అందించడానికి గోల్డ్ ట్రస్ట్ ద్వారా 200 మంది విద్యార్థినులకు రూ.16లక్షల ఆర్థిక సహాయాన్ని అందజేయడాన్ని ఎమ్మెల్సీ అభినందనలు వ్యక్తం చేశారు. మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం మాట్లాడుతూ కళాశాలలోని అధ్యాపకులకు 10 స్టాఫ్ చైర్స్ అందిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కళాశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ సుధాకర్, వెల్దండ కళాశాల ప్రిన్సిపాల్ సంజీవరెడ్డి, వంగూరు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, నాగర్‌కర్నూల్ కళాశాల ప్రిన్సిపాల్ మాధవి, కల్వకుర్తి కళాశాల అధ్యాపక బృందం వేణు, సదానందంగౌడ్, రమకాంత్, నయీం, పరుశరాం, బాలరాజు, భీమేష్, మల్లేష్, లక్ష్మయ్య, సంతోష్‌గౌడ్‌లతో పాటు విద్యార్థులు తదితరులు ఉన్నారు.

# కలెక్టరేట్ ఎదుట భవన కార్మికుల నిరసన..

**గద్వాల టౌన్,ఫిబ్రవరి 01 ప్రభాతవార్త :** గద్వాల జిల్లా వ్యాప్తంగా ఉన్న లేబర్ కార్డుల క్లెయిమ్స్ మ్యారేజ్ గిఫ్ట్ ప్రమాదవశాత్తు మరణం, అలాగే సహజ మరణం క్లెయిమ్స్‌లు వెంటనే మంజూరు చేయాలని ఏఓ యాదగిరికి వినతి పత్రం సమర్పించారు. అనంతరం లేబర్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ అబ్రహంకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టియు జిల్లా అధ్యక్షుడు సి. హనుమంతు, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు చింతరేవుల కృష్ణ, ఐఎఫ్‌టియు జిల్లా కోశాధికారి జమ్మిచెడు కార్తీక్‌లు మాట్లాడుతూ భవన ఇతర నిర్మాణరంగ కార్మికులు రాష్ట్రంలో 20 లక్షలకు పైగా ఉన్నారు. 20 లక్షల మంది కార్మికులలో 12 లక్షల మందికి మాత్రమే లేబర్ కార్డులు కలిగి ఉన్నారని మిగిలిన 8 లక్షలకు పైగా ఉన్న కార్మిక వర్గానికి లేబర్ కార్డు లెక్కన సంక్షేమ పథకాలు అందడం లేదన్నారు. నిర్మాణ రంగ కార్మికులు గ్రామాల్లో ఒక రకంగా, పట్టణాల్లో, నగరాల్లో మరో రకంగా సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. గ్రామాల్లో నిర్మాణ పనులు లేక పట్టణాలకు వలస వెళ్తున్నారు. వలస వెళ్లిన చోట ఉండడానికి కూడులేని స్థితి అద్దెలు చెల్లించలేని స్థితి ఎదుర్కొంటున్నారు.



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలియజేస్తున్న భవన రంగ కార్మికులు

అద్దాలపై ఏ మాత్రం వసతులు లేవని నిలబడడానికి సెటర్లు, తాగడానికి మంచినీళ్లు, మరుగుదొడ్డి సౌకర్యం లేక అవస్థల పాలవుతున్నారన్నారు. కార్యక్రమంలో పిడిఎస్‌యు జిల్లా కార్యదర్శి హరీష్, భవన నిర్మాణ జిల్లా సహాయ కార్యదర్శి కోళ్ల అంజి, ప్రేమ్



వినతి పత్రం అందజేస్తున్న భవన రంగ నిర్మాణ కార్మికులు

రాజ్, శేషన్న, అశోక్, నిచల్, కర్ణాకర్, తిమ్మప్ప, నాగరాజు, శేషన్న, నర్సింలు, ఏసన్న, పార్వతమ్మ, జ్యోతి, బసమ్మ, ధనుంజయ, నాగరాజు, శ్రీను, భాస్కర్, బలరాం, కరుణాకర్ పాల్గొన్నారు.

# చిత్రపటాలతో గ్రామ వనరుల ప్రదర్శన..

**బిజినేపల్లి,ఫిబ్రవరి 01 ప్రభాతవార్త :** గ్రామ వనరులు, రైతుల సాగు ప్రాధాన్యత, నేల స్వభావం, ప్రభుత్వ పథకాలపై విద్యార్థినులు ఏర్పాటు చేసిన చిత్రపటాల ప్రదర్శన ద్వారా వివరించారు. మండలంలోని ఖానాపూర్ గ్రామంలో రాజేంద్రనగర్‌కు చెందిన ప్రొ॥ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలోని సామాజిక విజ్ఞాన కళాశాలకు చెందిన రావేప్ విద్యార్థినులు బుధవారం గ్రామీణ భాగస్వామ్య విశ్లేషణాత్మక తులనం పేరిట (పిఆర్ఏ) నిర్వహించిన ప్రదర్శనలో వివిధ అంశాలను ప్రదర్శించారు. గ్రామ భౌగోళికం, రైతులు వేసిన పంటలు, చీడపీడలు తదితర అంశాలను చిత్రపటాల ద్వారా ప్రదర్శించి గ్రామస్తులకు వివరించారు. గ్రామపటం ద్వారా గ్రామ భౌగోళిక అంశాలను వివరించారు. గ్రామ వనరుల ద్వారా గ్రామంలోని చెరువులు, కుంటలు, రైతులు సాగు చేసిన పంటలను వివరించారు. నేలల స్వభావాన్ని మాత్రిక పటం ద్వారా గ్రామంలో రైతుల ప్రాధాన్యత, ఏఏ పంటలు ఎక్కువగా సాగు చేశారో వివరించారు.



గ్రామస్తులకు పట ప్రదర్శన ద్వారా వనరులను వివరిస్తున్న రావేప్ విద్యార్థినులు

గ్రామంలో పాఠశాలలు, వాటర్ ట్యాంకులు, అంగన్‌వాడి కేంద్రాలు, గ్రామ పంచాయతీ కార్యాలయాలు, దూరాలను తెలియజేశారు. పాలెం కెవికెకు చెందిన కెవికె న్యూట్రిషన్ శాస్త్రవేత్త డా.ఆఫిఫా జహాన్, రావేప్ విద్యార్థినిలు రూపొందించిన అంశాలను పరిశీలించి అభినందించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సితార, ఎంపిటిసి దారెడ్డి రఘుమారెడ్డి, సింగిల్‌విండో డైరెక్టర్ జిల్లెల నవీన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ అతినారపు తిరుపతయ్య, కావలి వెంకటయ్య, నారాయణ, సింహారెడ్డి, కె. రాములు, చంద్రయ్య,రావేప్ విద్యార్థినిలు మౌనిక, శివాని, రామాంజలి, రమాదేవి, అనూష, రుచిత, సాయి ప్రసన్న, భూమిక, శిరీష తదితరులు ఉన్నారు.

# పశువుల పునరుత్పత్తి శిబిరాలను వినియోగించుకోవాలి..

**-జిల్లా పశు వైద్య మరియు పశు సంవర్ధక శాఖ అధికారి జి.వి.రమేష్**

**కల్వకుర్తి, ఫిబ్రవరి 01 ప్రభాతవార్త:**పాడి పశువులలో పునరుత్పత్తి సక్రమంగా ఉన్నట్లు అయితే ఈతల మధ్య కాలం తగ్గి తద్వారా పశువుల జీవిత కాలంలో ఎక్కువ పాల దిగుబడి మరియు ఎక్కువ దూడలను పొందవచ్చునని, దీని ద్వారా పాడి పరిశ్రమ రైతులకు లాభసాటిగా ఉంటుందని జిల్లా పశువైద్య మరియు పశు సంవర్ధక శాఖ అధికారి జి.వి.రమేష్ పేర్కొన్నారు. బుధవారం కల్వకుర్తి పట్టణంలో ఏర్పాటు చేసిన పునరుత్పత్తి శిబిరాన్ని ప్రారంభించి రైతులనుద్దేశించి మాట్లాడారు. పుష్టికరమైన పశు గ్రాసాలను మేపినట్లైతే పశువులు ఆరోగ్యంగా ఉండి సరైన సమయంలో ఎదకు వచ్చి చూలు కడతాయని, ఆరోగ్యవంతమైన దూడకు జన్మనిస్తాయన్నారు. గర్భకోశ సమస్యలు రావని, పశువులు ఆరోగ్యంగా ఉండాలంటే పుష్టికరమైన పశుగ్రాసంతో పాటు మిశ్రమ దాన, ఖనిజ లవణాలు అందించాలని తెలిపారు. ఉచిత పశువైద్య శిబిరంలో ఏదకు రాని పశువులు, గర్భకోశ వ్యాధులు,



రైతులకు మిశ్రమ దాన, ఖనిజ లవణాలు అందజేస్తున్న దృశ్యం

ఇతర వ్యాదులు ఉన్న 150 పశువులకు చికిత్సలు చేశారు. ఈ శిబిరాలు జిల్లా వ్యాప్తంగా 200 నిర్వహిస్తున్నట్లు తెలిపారు.అదే విధంగా ప్రభుత్వం నుంచి సంవత్సరానికి రెండు సార్లు గాలికుంటు టీకాలు, గొంతు వాపు, జబ్బ వాపు టీకాలు ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. బ్రుసెల్ల వ్యాధి నివారణ కొరకు జిల్లాలో 4-8 నెలల వయస్సు ఉన్న ఆడ దూడలకు ఉచితంగా టీకాలు అందిస్తునా న్నమని, బ్రుసెల్ల వ్యాధి సోకిన యెడల పశువులకు అబార్షన్ అయ్యే ప్రమాదం ఉంటుందన్నారు. ఈ టీకా అందిస్తే జీవితకాలం వ్యాధి నుంచి రక్షణ అందుతుందన్నారు. 72 దూడలకు బ్రుసెల్లా టీకాలు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కల్వకుర్తి ఏడీ జగదీశ్వరి, డాక్టర్ రాజేష్‌ఉమార్, వీఏ ప్రవీణ, సిబ్బంది నరసింహ, జంగయ్య, రైతులు తదితరులు ఉన్నారు.

# దేవరకద్రలో ఉర్సు ఉత్సవాలు ప్రారంభం..

**దేవరకద్ర,ఫిబ్రవరి 01 ప్రభాతవార్త:** దేవరకద్రలోని రైల్వేస్టేషన్ ఏరియాలోని హజ్రత్ శేఖ్ మొహియొద్దీన్ బాబా ఉర్సు వేడుకలు బుధవారం అంగరంగా వైభవంగా ప్రారంభమయ్యాయి, ప్రతి ఏడాది సాహెబ్ ఉర్సు వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. అందులో భాగంగానే ఈ ఏడాది కూడ సాహెబ్ 38వ ఉర్సు వేడుకలను ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సాహెబ్ దర్గాలో ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించారు. అలాగే గుసూలె షరీఫ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సాహెబ్ దర్గాపై పూలఛాదర్‌లు కప్పి ప్రత్యేక ఫాతెహా కార్యక్రమాన్ని నిర్వహించారు. దర్గా సజ్జాదెనషీన్ మొహ్మద్ మక్దూమ్‌బాబా అధ్వర్యంలో ఈ కార్యక్రమాలను నిర్వహించారు. చాలామంది ఇదే విధంగా దర్గాపై పూలఛాదర్‌లు కప్పి తమ మొక్కులు తీర్చుకున్నారు. ఫాతెహాలు ఇప్పించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రజలతో పాటు వివిధ ప్రాంతాల



దేవరకద్రలో దర్గాపై పూలఛాదర్ కప్పుతున్న భక్తులు

నుండి భక్తులు,సాహెబ్ మురీద్‌లు అధికసంఖ్యలో పాల్గొన్నారు. ఉర్సులో భాగంగా గురువారం సాహెబ్ సన్నిదిలో ఖత్మేఖురాన్ తదతర కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు దర్గా నిర్వహకుడు మొహ్మద్ మక్దూమ్‌బాబా తెలిపారు.

# ఎమ్మెల్యే సతీమణికి స్వాగతం పలికిన ఆలయ సిబ్బంది



ఎమ్మెల్యే సతీమణికి స్వాగతం పలుకుతున్న దృశ్యం



అమ్మవారిని దర్శించుకుంటున్న దృశ్యం

**గద్వాల టౌన్,ఫిబ్రవరి 01 ప్రభాతవార్త :** గద్వాల పట్టణంలోని జమ్ములమ్మ దేవాలయంలో గుర్రంగడ్డ నుండి జమ్మిచెడ్ వరకు దేవాలయం వరకు ఎద్దుల బండి మీద ఉన్న వారిని తీసుకోవడం జరిగింది. గద్వాల ఎమ్మెల్యే సతీమణి బండ్ల జ్యోతి ఘనంగా స్వాగతం పలికారు. దేవాలయంలో ఎమ్మెల్యే సతీమణి బండ్ల జ్యోతి ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి దర్శనం చేసుకున్నారు. అనంతరం అమ్మవారి ప్యాకెట్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఎమ్మెల్యే సతీమణి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం లాగానే ఈ సంవత్సరం కూడా అంగరంగ వైభవంగా జాతర నడిగడ్డ ఇలవేల్పు అమ్మవారు దర్శనానికి కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ వంటి ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించి ఎలాంటి ఇబ్బంది లేకుండా ఏర్పాటు చేయడం జరుగుతుంది. నడిగడ్డలో ఇలవేల్పు అయిన జమ్ములమ్మ అమ్మవారు పుట్టినింటికి మెట్టినింటికి రావడం ప్రజలందరు కొంగు బంగారం కావాలని ప్రతి సంవత్సరం లాగే వారి మొక్కులు తీర్చుకుని అమ్మవారిని దర్శించుకున్నారు. వివిధ ప్రాంతాల నుండి భక్తులకు దర్శనం చేసుకుని క్షేమంగా వారి ప్రాంతాలకు చేరుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా కెటిఆర్ యువసేన ప్రధాన కార్యదర్శి కృష్ణకుమార్‌రెడ్డి, కౌన్సిలర్ నాగిరెడ్డి, ఆలయ కమిటి ఛైర్మన్ సతీష్, డైరెక్టర్ సుందరరాజ్, నాయకులు ఓం ప్రకాష్, రవి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు ఏకాగ్రతతో చదివి ఉన్నతంగా రాణించాలి...

**వెల్దండ, ఫిబ్రవరి 01 ప్రభాతవార్త:**విద్యార్థులు ఏకాగ్రతతో చదివి ఉన్నతంగా రాణించాలని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, ఎన్ఆర్ఐ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి పేర్కొన్నారు. వెల్దండ మండల పరిధిలోని పెద్దాపూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను బుధవారం సందర్శించి ప్రధానోపాధ్యాయులు రాజశేఖర్‌తో కలిసి 10వ తరగతి విద్యార్థులకు అల్పహారం అందించారు. ఈ సందర్భంగా చైర్మన్ రాఘవేందర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చదువులో వెనుకంజలో ఉండకూడదని, చదువు ద్వారానే దేనినైనా సాధించవచ్చునని, చదువుకుంటే ఉన్నతంగా రాణించవచ్చునన్నారు. 10వ తరగతి పరీక్షలు పూర్తయ్యే వరకు విద్యార్థులకు ఉదయం పూట అల్పాహారం అందిస్తానని చైర్మన్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాఘవేందర్, సునితరాణి, గ్రామస్తులు జయంత్‌రెడ్డి, జీవన్, నెంట రాజు, యాదగిరి, సుధాకర్‌రెడ్డి, జిలానీతో పాటు తదితరులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి

## వివాహ వేడుకలకు హాజరైన మాజీ ఎమ్మెల్యే

**కేటిదొడ్డి,ఫిబ్రవరి 01 ప్రభాతవార్త :** మండల కేంద్రంలో జరిగిన గద్వాల కర్రెన్న కుమారుడు వివాహానికి మాజీ ఎమ్మెల్యే, బిజెపి సీనియర్ నాయకులు డికె భరతసింహారెడ్డి హాజరై వధూవరులను ఆశీర్వదించారు.



కార్యక్రమంలో బిజెపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## 8 నుంచి జాతీయస్థాయి బండలాగుడు పోటీలు ప్రారంభం

**బిజినేపల్లి,ఫిబ్రవరి 01 ప్రభాతవార్త :** మండల కేంద్రంలో ఈనెల 8 నుంచి 12 తేదీ వరకు జాతీయస్థాయి ఒంగోలు జాతి బండలాగుడు పోటీలు నిర్వ హిస్తున్నట్లు బుధవా రం సర్పంచ్ బాలీశ్వర్ తెలిపారు. ఆనందగిరి లక్ష్మి వెంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా బండలాగుడు పోటీలు ఐదురోజుల పాటు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి, ఎంపి రాములు, ఎమ్మెల్సీలు కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి, గోరటి వెంకన్నతో పాటు స్థానిక ప్రజా ప్రతినిధులు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజలు, రైతులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## ఆర్థిక సహాయం అందజేత

**బిజినేపల్లి,ఫిబ్రవరి 01 ప్రభాతవార్త :** అంత్యక్రియల కోసం తనవంతు సాయంగా మండల రైతు సమితి అధ్యక్షుడు నెల్లికంటి మహేశ్వర్‌రెడ్డి మృతు రాలి కుటుంబ సభ్యు లను పరామర్శించి రూ.5వేల ఆర్థిక స హాయం అందజేశారు. మండల కేంద్రానికి చెందిన ఫాతిమాబేగం (80) అనే వృద్ధురాలు బుధవారం ఉదయం అనారోగ్యంతో మృతి చెందింది. ఆయన వెంట సురేష్, రిజ్వాన్, సత్యం, ఇర్ఫాన్, కావలి ఆంజనేయులు ఉన్నారు.

## దేవరకద్ర వ్యవసాయ మార్కెట్‌ధరలు

**రూ.6549 ధర పలికిన కింటాల్ ఆముదాలు**

**దేవరకద్ర,ఫిబ్రవరి 01 ప్రభాతవార్త:** దేవరకద్ర వ్యవసాయ మార్కెట్ యార్డుకు బుధవారం 8 కింటాళ్ళ ఆముదాలు రైతులు విక్రయానికి తీసుకవచ్చారు. అయితే కింటాల్ ఆముదాలకు అత్యధికంగా రూ.6549 ధర పలికింది. అలాగే అతి తక్కువగా రూ.6401 ధర పలికింది. అలాగే 10 కింటాళ్ళ కందులను రైతులు విక్రయానికి తీసుకవచ్చారు. కింటాల్ కందులకు అత్యధికంగా రూ.6982 ధర పలికింది. అతితక్కువగా రూ.6802 ధర పలికింది. అలాగే 16 కింటాళ్ళ సోన ధాన్యాన్ని రైతులు విక్రయానికి తీసుకవచ్చారు. కింటాల్ సోనాకు అత్యధికంగా రూ.2169 ధర పలికింది. అతితక్కువగా కూడ అంతే ధర పలికింది. 211 కింటాళ్ళ ఉల్లిని రైతులు విక్రయానికి తీసుకవచ్చారు. అత్యధికంగా కింటాల్ ఉల్లికి రూ. 1600 ధర పలికింది. అలాగే అతి తక్కువగా రూ.850 ధర పలికినట్లు మార్కెట్ అధికారులు తెలిపారు.

## గోపన్‌పల్లిలో ఉచిత పశువైద్యశిబిరం

**దేవరకద్ర,ఫిబ్రవరి 01 ప్రభాతవార్త:** దేవరకద్ర మండలం గోపన్‌పల్లిలో బుధవారం ఉచిత పశువైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పశువైద్య అసిస్టెంట్ డైరెక్టర్ అబ్దుల్ రశీద్ పశువుల యజమానులకు.రైతులకు పలు



సూచనలు,సలహాలు ఇచ్చారు. ఫెర్టిలిటి రోగాలకు సంబందించిన రోగాలు,పాల ఉత్పత్తి గురించి వివరించారు.ఈ సందర్భంగా వారికి పశువుల ఇంజెక్షన్‌లు,టాబ్లెట్స్ ఇచ్చారు.అలాగే గేదెలు,ఆవులు, దూడలకు సంబందించిన మందులను కూడ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పశువైద్యాదికారి జీషాన్‌అ లి,సర్పంచ్ కోట్ల రజిత,యంపీటీసి అంజనేయులు,ఉపసర్పంచ్ అరుణ,రైతు సంఘం అధ్యక్షుడు కోట్ల శ్రీనివాసరెడ్డి,పశువైద్య సిబ్బంది,గోపాలమిత్ర,రైతులు,గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ ప్రజా వ్యతిరేక బడ్జెట్



**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఫిబ్రవరి 01 ప్రభాతవార్త:**కేంద్ర ప్రభుత్వం 2023-24 సంవత్సరానికి ప్రవేశ పెట్టిన బడ్జెట్ ప్రజా వ్యతిరేక బడ్జెట అని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్ధన్ పర్వతాలు అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కేవలం ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని మాత్రమే బడ్జెట్ ప్రవేశ పెట్టిందని, బడ్జెట్ వల్ల నాగర్‌కర్నూల్ జిల్లా ప్రాంతానికి, వెనుకబడిన పాలమూరు జిల్లాకు ఏ మాత్రం ఉపయోగం లేదన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో రైల్వే లైన్ కోసం ప్రతిపాదన పంపిన ప్రతిపాదనలు ప్రతిపాదనగానే మిగిలిపోయాయని ఆయన పేర్కొన్నారు. గతంలో రైల్వే లైన్ కోసం రైల్వేలైన్ ప్రతిపాదన సిద్ధం చేయడానికి 98వేల కోట్ల రూ॥లు కేటాయిస్తే ఆ అ అంచనా ఇప్పుడు 1500 కోట్లక చేరిందన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌పై పార్లమెంట్‌లో ఎంపీలు చర్చించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఆర్.శ్రీనివాసులు, గీత, శ్రీనివాసులు, రామయ్య, అంతటి కాశన్న, వెంకటేష్, తారాసింగ్, లక్ష్మయ్య తదితరులు ఉన్నారు.

# సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం



విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ వెంకటేష్ గౌడ్

**ఖిల్లాఘణపురం,ఫిబ్రవరి1 ప్రభాతవార్త:** మండల పరిధిలోని మామిడిమాడ గ్రామాల్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఎస్ఐ వెంకటేష్ గౌడ్ ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రజలు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బ్యాంకు ఖాతాదారుల ఖాతాల నుండి క్షణాల్లో సైబర్ నేరగాళ్లు డబ్బులు మాయం చేస్తారని అన్నారు. అపరిచిత ఫోన్ కాల్ లకు వ్యక్తిగత సమాచారాలు అందించరాదని అన్నారు. సైబర్ నేరగాళ్ల ఫోన్‌లో మాట్లాడుతూ ఖాతాలను ఖాళీ చేయడానికి పలు రకాల అడ్డదారులు చూస్తున్నారని అన్నారు. సమాచారం నిమిత్తం బ్యాంకు అధికారులమని చెబుతూ ప్రజలను తప్పుదారి పట్టిస్తూ సైబర్ నేరాలకు పాల్పడుతున్న మోసగాళ్లు సమాజంలో పెరిగిపోయారని అన్నారు. గుర్తు తెలియని వ్యక్తులకు ఏటీఎం పిన్ నెంబర్ బ్యాంకు అకౌంట్ నెంబర్లు వ్యక్తిగతానికి చెందిన వివరాలు ఏవి తెలుపవద్దని అన్నారు. సైబర్ నేరాలకు గురైతే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ ఉన్నతమైన ప్రమాణాలతో విద్యను అభ్యసించాలని ఆకాంక్షించారు. మాదకద్రవ్యాలు వినియోగించి వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తమన్నారు. రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తూ వాహనాలు నడపాలని అన్నారు. 18 సంవత్సరాలలోపు యువకులు వాహనాలతో రోడ్లపై తిరగరాదని సూచించారు. మంచి విలువలతో కూడిన విద్యను అభ్యసించి ఉన్నత పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. గ్రామాల్లోని ప్రజలు పోలీస్ సిబ్బందికి సహకరించాలని అన్నారు. సీసీ కెమరాల ఏర్పాటుతో 24గంటల పాటు నేరాలపై పర్యవేక్షణ చేసే అవకాశం ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రావు, సర్పంచ్ మోహన్ జీ, గ్రామ పెద్దలు గ్రామస్తులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఆయిల్ పామ్ పంట సాగుతో అధిక లాభాలు



ఆయిల్‌పామ్ మొక్కలు నాటుతున్న జడ్పీటిసి, సిఐ

**ఇటిక్యాల,ఫిబ్రవరి 1 ప్రభాతవార్త :** ఆయిల్‌పామ్ పంట సాగుతో రైతులకు అధిక లాభాలు వస్తాయని అదేవిధంగా ప్రభుత్వం మొక్కలపై సబ్సిడి అందిస్తుందని నీటి సౌకర్యం ఉన్న రైతులు ఆయిల్ పామ్ పంట సాగు చేసుకోవాలని జడ్పీటిసి హనుమంత్‌రెడ్డి, అలంపూర్ సిఐ సూర్యనాయక్, ఎస్సై గోకారి రైతులకు అవగాహన కల్పించారు. బుధవారం మండల పరిధిలోని కొండపేట గ్రామంలోని ప్రహ్లాదచారి వ్యవసాయ పొలంలో జడ్పీటిసి హనుమంత్‌రెడ్డి, అలంపూర్ సిఐ సూర్యనాయక్, స్థానిక గ్రామ సర్పంచ్ నరసమ్మ సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆయిల్‌పామ్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఉద్యానవన శాఖ అధికారులు మాట్లాడుతూ ఆయిల్‌పామ్ పంటలను ఒకసారి వేసుకుంటే నాలుగు సంవత్సరాల నుండి 30 సంవత్సరాల వరకు స్థిరమైన ఆదాయం ఇస్తుందని పంటకు తక్కువ పెట్టుబడి దీర్ఘకాలిక పంటగా ఉంటుందని అలాగే చీడపీడల బాధ తక్కువగా ఉంటుందని అదేవిధంగా రైతుకు నెలనెలా స్థిరమైన ఆదాయాన్ని ఇవ్వడంతో పాటు ఒక రకమైన భరోసా కల్పించడం జరుగుతుందని భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వమే ఈ పంటకు భారీగా సబ్సిడి అందించి రైతులను ప్రోత్సహిస్తుందని ఆయిల్‌పామ్ ధర రూ. 193 కాగా 173లకు సబ్సిడి ఇచ్చి కేవలం రూ.20లకు ఒక మొక్కను రైతులకు సరఫరా చేస్తుందన్నారు. అదేవిధంగా డ్రిప్ ఇరిగేషన్ ద్వారా సన్న, చిన్నకారు రైతులకు 90 శాతం, ఎస్సీ, ఎస్టీ రైతులకు 100 శాతం సబ్సిడి అందుతుందని 5 ఎకరాలకు పైబడిన పెద్దకారు రైతులకు 80 శాతం సబ్సిడి ఇస్తుందని సంవత్సరానికి ఆయిల్ పామ్ పంట సాగు రైతుకు, అంతర పంటలసాగు కొరకు 4 వేల 2 వందల రూపాయల ఎకరానికి ఇచ్చి పంట సాగుచేసేలా ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని వారు వివరించారు. ఆయిల్ పంప్ పంట సాగుకోసం ఆసక్తిగల రైతులు మండల ఉద్యానవన శాఖ అధికారిని సంప్రదించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై గోకారి, ఉద్యానవన శాఖ అధికారి రాజశేఖర్, ఆయిల్ ఫీడ్ ఉద్యోగి రామకృష్ణ, డ్రిప్ ప్రతినిధి కొఠారి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## బాలికలకు కరాటే శిక్షణ తరగతుల ప్రారంభం



కరాటే శిక్షణ తరగతులు ప్రారంభిస్తున్న దృశ్యం

**మూసాపేట,ఫిబ్రవరి 1 ప్రభాతవార్త:** నందిపేట గ్రామ ప్రాథమికోన్నత పాఠశాల బుధవారం పాఠశాలలో చదువుకుంటున్న బాలికలకు ఆత్మరక్షణ శిక్షణ తరగతులను కరాటే మాస్టర్ సత్యనారాయణ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి. నరసింహ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా కరాటే మాస్టర్ మాట్లాడుతూ నేటి సమాజంలో బాలికలకు ఆత్మరక్షణ చాలా అవసరం అని గ్రహించి బాలికలకు నెల రోజుల శిక్షణ తరగతులను నిర్వహించి మనోస్థైర్యం కోల్పోకుండా చదువులో కూడా రాణించి సరైన పద్ధతులలో నడుచుకునేటట్లు చేయడమే లక్ష్యంగా ఇటువంటి కార్యక్రమం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు నరసింహ, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## బీజేపీ మండల ఉపాధ్యక్షిడిగా రామచందర్



బీజేపీ మండల ఉపాధ్యక్షులుగా రామచందర్‌కు నియామకపత్రం అందజేత

**ఖిల్లాఘణపురం,ఫిబ్రవరి1 ప్రభాతవార్త:** మండల కేంద్రంలో జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో బీజేపీ మండల ఉపాధ్యక్షుడుగా రాంచందర్‌ను నియమించినట్లు మండల బీజేపీ పార్టీ అధ్యక్షుడు నవీన్‌రెడ్డి తెలిపారు. మం డల కార్యదర్శిగా రాఘవేందర్ రెడ్డికి నియామక పత్రాలు అందజేశారు. బీజేపీ పార్టీ సిద్దాంతాలను కార్యక్రమాలు ప్రజల్లోకి చేరవేయాలని అన్నారు. బీజేపీ నాయకులు బాధ్యతాయుతంగా పార్టీ కార్యక్రమాలను విజయవంతం చేయాలని సూచించారు. పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా కార్యకర్తలు పని చేస్తూ ప్రజల పక్షాన నిలబడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజవర్ధన్‌రెడ్డి, సీనియర్ నాయకులు రావుల రవీంద్రనాథ్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శులు ఆంజనేయులు, శివ శంకర్, జిల్లా అధికార ప్రతినిధి బుచ్చిబాబుగౌడ్, ఓబీసీ కార్యదర్శి ఆశన్న, గిరిజన మోర్చ అధ్యక్షుడు గోపి నాయక్, యువమోర్చ అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన విద్యార్థి సంఘం అధ్యక్షునిగా మూడావత్ రవీందర్



గిరిజన సంఘం అధ్యక్షునిగా నియమకపత్రం అందుకుంటున్న మూడావత్ రవీందర్

**వనపర్తి రూరల్,ఫిబ్రవరి 1 ప్రభాతవార్త:** డీఎన్ఆర్ కళాశాలలో గిరిజన విద్యార్థి సంఘం నూతన కమిటీ కొరకు కార్యనిర్వాహక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో విద్యార్థుల సమక్షంలో గిరిజన విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షునిగా మూడావత్ రవీందర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు విద్యార్థి సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు అంగోత్ రాజ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్.నరేష్, కె.నరేష్, భగవాన్, కేశవులు, ఎమ్,గోవిందు, మున్నా, యుగంధర్, శేఖర్, కురుమయ్యలు పాల్గొన్నారు.

## సగర సంఘం నూతన కమిటీ ఎన్నిక



కల్వకుర్తి తాలూకా, మండల కమిటీ సగర సంఘం

**కల్వకుర్తి, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త:** కల్వకుర్తి పట్టణంలోని సగర సంఘం (ఉప్పర) భవనంలో బుధవారం జిల్లా గౌరవ అధ్యక్షులు వావిలాల భీమయ్య సాగర్ ఆధ్వర్యంలో కల్వకుర్తి తాలూకా, మండల సగర సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. తాలూకా గౌరవ అధ్యక్షులుగా శేగూరి దుర్గయ్యసాగర్, తాలూకా అధ్యక్షులు పడకంటి దుర్గయ్య సాగర్, ప్రధాన కార్యదర్శి కొల్లె దామోదర్ సాగర్, కోశాధికారిగా వావిలాల మురళీధర్ సాగర్, మండల అధ్యక్షులుగా పడకంటి రాజు సాగర్, ప్రధాన కార్యదర్శిగా వేముల శ్రీనివాసులు సాగర్, కోశాఇకారిగా అనిశెట్టి శేఖర్ సాగర్, యూత్ కమిటీ అధ్యక్షులుగా గోపి సాగర్, ప్రధాన కార్యదర్శిగా ఎస్. నరేష్ సాగర్, కోశాధికారిగా రొట్టె శేఖర్ సాగర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడతూ సగరులు రాజకీయంగా, ఆర్థికంగా వెనుకబడి ఉన్నారని, సగర సంఘం బలోపేతానికి కృషి చేస్తామన్నారు. సగరులు అన్ని రంగాల్లో రాణించేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సగర సంఘం నాయకులు తదితరులు ఉన్నారు.

## పేదలకు వ్యతిరేకంగా కేంద్ర బడ్జెట్



వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.వెంకటేశ్వర్లు

**వనపర్తి టౌన్,ఫిబ్రవరి 1 ప్రభాతవార్త:** కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతా రామన్ ప్రకటించిన కేంద్ర బడ్జెట్ లో పేదలకు సామాన్యులకు వ్యతిరేకంగా ఉందని వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడ్జెట్ కార్పొరేటర్లకు అనుకూలంగా పేదలకు వ్యతిరేకంగా ఉందని తెలంగాణ రాష్ట్రానికి బడ్జెట్ లో ఏమీ ప్రవేశపెట్టలేదని ఆయన అన్నారు. గద్వాల, వనపర్తి, మాచర్ల రైల్వే లైన్ ఊసే లేదని ఎన్నో ఏళ్ల కళ వనపర్తి జిల్లా ప్రజలు రైల్వే లైన్ కోసం వేచి చూస్తున్నారని కానీ ఈ బడ్జెట్ లో ఎలాంటి ప్రకటన రాలేదని ఆయన బాద వ్యక్తం చేశారు.

# ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలు ఎక్కడ?

■ నడిగడ్డ హక్కుల పోరాట సమితి మండల అధ్యక్షుడు నెట్టెంపాడు గోవిందు



మాట్లాడుతున్న నడిగడ్డ హక్కుల పోరాట సమితి మండల అధ్యక్షుడు నెట్టెంపాడు గోవిందు

**ధరూర్,ఫిబ్రవరి 1 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని నడిగడ్డ పోరాట సమితి కార్యాలయంలో ఎన్నికల సమయంలో ఏకగ్రీవమైన గ్రామ పంచాయతీలలో ప్రత్యేకమైన అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని ఇచ్చిన హామీలు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా మారిందని నడిగడ్డ హక్కుల పోరాట సమితి ధరూర్ మండల అధ్యక్షుడు నెట్టెంపాడు గోవిందు అన్నారు. బుధవారం నడిగడ్డ హక్కుల పోరాట సమితి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల సమయంలో ఏకగ్రీవమైన గ్రామ పంచాయతీకి ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా వాటిని నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. అలాగే ధరూర్ మండల పరిధిలోని ఏకగ్రీవమైన ద్యాగదొడ్డి, నాగర్ దొడ్డి,కోతులగిద్ద,పార్చర్ల, బూరెడ్డిపల్లి, ఓబులోనిపల్లి, మన్నాపురం, నీలహల్లి, గ్రామ పంచాయతీకి వివిధ మౌలిక సదుపాయాలు, ప్రధాన రోడ్ల అభివృద్ధి పనులు చేస్తామని ఇచ్చిన మాటను నిలబెట్టు కోకుండా గ్రామాల్లో ఎలాంటి అభివృద్ధి పనులు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరి స్తున్నారని అన్నారు. ఈ విషయంపై నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్ గొంగళ్లహక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్ గొంగళ్ల రంజిత్‌కుమార్ ఆధ్వర్యంలో త్వరలోనే కార్యాచరణ ప్రకటిస్తున్నట్లు ఈ సందర్భంగా ఆయన తెలిపారు. కార్యక్రమంలో నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా నాయకులు పరశురాముడు,మండల ఉపాధ్యక్షుడు ఆంజనేయులు, మండల నాయకులు కె.జగదీష్,కృష్ణ,దరెప్ప, చిన్న నర్సింహులు, చిన్న సవారన్న, నర్సింహులు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# మటన్ మార్కెట్ ఏర్పాటును విరమించుకోవాలి



కార్యక్రమంలో పాల్గొన్న ఆరెకటిక కులస్థులు

**వీపనగండ్ల,ఫిబ్రవరి1 ప్రభాతవార్త:** ఆరెకటిక కులవృత్తిని నమ్ముకొని మాంసం విక్రయిస్తూ జీవనాన్ని గడుపుతున్న తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం మటన్ మార్కెట్లను ఏర్పాటు చేస్తామని ప్రకటించడం ఆరెకటిక కుటుంబాలను వీధిపాలు చేయడమేనని వెంటనే మటన్ మార్కెట్ ల ఏర్పాట్లను విరమించుకోవాలని మండల ఆరెకటిక సంఘం అధ్యక్షుడు హెచ్.శివాజీ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన మండల ఆరెకటిక సంఘం సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ మటన్ మార్కెట్ ల ఏర్పాటును ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం ఆరెకటికె కులస్థులకే లైసెన్సులు ఇచ్చి మటన్ మార్కెట్లను ఏర్పాటు చేయించాలని ఆయన డిమాండ్ చేశారు. మటన్ మార్కెట్ ఏర్పాట్ల కోసం ప్రతి ఆరెకటిక కుటుంబానికి రూ.5లక్షల ఆర్థిక సాహాయాన్ని అందజేయాలన్నారు. ఎన్నో రోజులుగా ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతూ బీసీ కులస్థుల్లో బీసీ–డీ గ్రూపులో ఉండడంతో విద్యలోనూ వెనకబడ్డ ఆరెకటిక కులస్థులు చాలీచాలని జీవితాలతో కాలాన్ని వెల్లదీస్తున్న ఆరెకటికలను ఆదుకోకపోగా మటన్ మార్కెట్‌ల ఏర్పాటుతో కులవృత్తిని నమ్ముకొని జీవనాన్ని సాగిస్తున్న ఆరెకటికలను మరోమారు మోసం చేయడమేనని ఆయన అన్నారు. ఆరెకటిక కులస్థులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించకుంటే ఆందోళన కార్యక్రమాలకు శ్రీకారం చుడతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘంనాయకులు శంకర్ జీ, బాలాజీ, పీరు,శ్రీను, హెచ్.శ్రీనివాసులు జీ, లక్ష్మీజీ, శంకర్ పాల్గొన్నారు.

# మండల సాధన కోసం విద్యార్థుల మానవహారం



మానవహారాన్ని నిర్వహిస్తున్న విద్యార్థులు

**కోయిల్‌కొండ,ఫిబ్రవరి 1 ప్రభాతవార్త:** గార్లపాడు గ్రామాన్ని నూతన మండలంగా ఏర్పాటు చేయాలని గ్రామంలోని అన్ని పాఠశాలల విద్యార్థులు రోడెక్కి గ్రామమంతా కలియ తిరుగుతూ గార్లపాడును వెంటనే మండలంగా ప్రకటించాలంటూ నినాదాలు చేస్తూ హోరెత్తించారు. కోయిల్‌కొండ మండలంలోని గార్లపాడు గ్రామాన్ని నూతన మండలంగా ప్రకటించాలని విద్యార్థులు మానవహారం నిర్వహించారు. గ్రామంలోని అంబేద్కర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థుల మానవహారాన్ని ఉద్దేశించి మండల సాధన సమితి నేతలు జెఏసి కన్వీనర్ఎం. రామునాయక్, కో కన్వీనర్ వెంకట్రాంరెడ్డిలు మాట్లాడుతూ మండల సాధన కోసం రిలే నిరాహార దీక్షలు ప్రారంభమై వారం రోజులపాటు గడుస్తున్నా ఇప్పటివరకు అధికారులు కానీ, ప్రజాప్రతినిధులు కానీ స్పందించడం లేదన్నారు. ప్రజలు కోరుకున్న మండలాన్ని వెంటనే తప్పక ప్రకటించాలని వారు పాలకులకు, అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఉద్యమం ఉధృతం కాకముందే ప్రజల అభిప్రాయాన్ని గౌరవించి గార్లపాడు గ్రామాన్ని వెంటనే నూతన మండలంగా ప్రకటించి ప్రజల కోరికను తీర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఆంజనేయులు, మండల సాధన సమితి నేతలు కనకయ్య, రవి, జంగం, ఆంజనేయులు, వెంకటేష్‌గౌడ్, వెంకటాచారి తదితరులు పాల్గొన్నారు.

# పేదలను కొల్లగొట్టి పెద్దలకు విందు చేసిన బడ్జెట్

● రైతుబతుకు రెట్టింపు చూపని బడ్జెట్ ఎందుకు? : వనపర్తి జిల్లా కాంగ్రెస్ కిసాన్ సెల్ అధ్యక్షుడు వేముల శ్రీనివాస్ రెడ్డి



**వనపర్తి ప్రతినిధి,ఫిబ్రవరి 1 ప్రభాతవార్త:** ఈ ఆర్థిక సంవత్సరం కోసం కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ బుధవారం పార్లమెంట్ లో ప్రవేశపెట్టిన బడ్జెట్ పేదలను, రైతులను కొల్లగొట్టి వాళ్లకు విందు చేపించిన బడ్జెట్‌గా ఉందని ఆరోపించారు. పేదలు అయిన సామాన్య ప్రజల నుండి వారి శ్రమ ఫలాలను కొల్లగొట్టి కార్పొరేట్లకు కొమ్ముకాస్తు దోపిడీ దొరల సేవ కోసం ఈ బడ్జెట్ ప్రవేశపెట్టారని వనపర్తి జిల్లా కాంగ్రెస్ కిసాన్ సెల్ అధ్యక్షుడు వేముల శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు, పేదలకు ఈ బడ్జుట్ సంతృప్తికరంగా లేదని అన్నారు. మోదీ ఎన్నికల సమయంలో రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని చెప్పిన హామీ పై బడ్జెట్‌లో ఏదీ లేదు, రైతులను నాశనం చేయడానికి ఈ బడ్జెట్ ప్రవేశపెట్టారని అన్నారు. రైతు రాజ్యం అని ఎన్నికలముందు చిలుకపలుకులు పలికిన ప్రధానమంత్రి నరేంద్రమోదీ పగలు రాత్రి ఎండా వాన అనేక కష్టాలను వార్చుకోని దేశానికి అన్నం పెట్టే రైతు పంటలకు ఎంఎస్‌పీ ఎందుకు ఇవ్వరని ఎందుకు ప్రవేశ పెట్టలేదని అన్నారు. స్వామినాథన్ కమీషన్ సిఫార్సుల ప్రకారం వ్యవసాయ దిగుబడులకు మద్దతు ధర ప్రకటన చేయలేని ప్రభుత్వం సిగ్గుచేటు వ్యవసాయం అంటే దేశంలో ఉండే 130కోట్ల మంది ప్రజల హక్కు 75ఏండ్లే స్వాతంత్ర్యం వచ్చి రైతులు ఇంకా ఆత్మహత్యతలు చేసుకుంటున్నారని మరి ఎంపీలు, ఎమ్మెల్యేలు ఎందుకు ఆత్మహత్యలు చేసుకోవడం లేదని ప్రశ్నించారు. లాభం వస్తే దేశాన్నికి నష్టం వస్తే రైతుకు కాదు అదిఅందరికి పెట్టాలి. వ్యవసాయ కూలీలను, కౌలుదారులను ఏబీ ఆదుకోలేదని అన్నారు. దేశంలోఉత్పత్తి అయ్యే అన్ని రకాల సరుకులకు ఎంఆర్‌పీ ధర నిర్ణయించినట్లుగా రైతులకు ఎంఎస్‌పీ ఎందుకు దక్కదని ఆయన తెలిపారు. రైతు పండించిన పంటకు గిట్టుబాటు దొరకని దుస్థితిలో దళారీ చేతిలో రైతులు కీలుబొమ్మగా మార్చిందని, మార్కెట్ లో ప్రతి వస్తువుకు పెరిగిపోతున్న ధరలను అదుపు చేయకుండా ఎరువులు, పురుగు మందులు, పెట్రోల్, డీజిల్ ధరలను నియంత్రించలేని ప్రభత్వంగా మారిందని అన్నారు. ఈ బడ్జెట్ సామాన్య జనాలకు విషం ఎక్కించి పైన తీపి పూతలను పూసిన బడ్జెట్ గా ఉందని అన్నారు.

# అర్హులందరికి మూడు లక్షల రూ॥లు అందించాలి



ఇంటింటి సర్వే చేపడుతున్న దృశ్యం

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఫిబ్రవరి1 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన విధంగా ఇంటి స్థలం ఉన్న ప్రతి పేదవాడికి రూ.3లక్షల అందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పర్వతాలు డిమాండ్ చేశారు. గురువారం సీపీఎం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పట్టణంలోని బీసీ కాలనీలో లబ్ధిదారులకు ధరఖాస్తు పెట్టి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఈ నెల ప్రవేశ పెట్టే బడ్జెట్‌లో ప్రత్యేక నిధులు కేటాయించి అందరికి రూ.3లక్షలు అందించాలని డిమాండ్ చేశారు. పట్టణ కేంద్రాల్లో డబుల్ బెడ్‌రూం ఇండ్లను నిర్మించారని, వాటిని త్వరితగతిన పూర్తి చేసి పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. డబుల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణం పేరుతో ఇంటి స్థలాలు ఇచ్చే జీఓను రద్దు చేశారని, దానిని పునరద్ధరించి ఇంటి స్థలం లేని పేద వారికి ఇంటి స్థలాలు పంపిణీ చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆర్.శ్రీనివాస్, ఐద్వా జిల్లా కార్యదర్శి గీత, కాశన్న, అశోక్, ఈశ్వరమ్మ, నరసింహ, బాలు తదితరులు ఉన్నారు.

## కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి

● మాజీ ఎంపీపీ మన్నెపురెడ్డి



ముందరి తండాలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎంపీపీ మన్నెపురెడ్డి

**పెద్దమండడి,ఫిబ్రవరి 1 ప్రభాతవార్త:** మండల పరిధిలోని ముందరితాండాలో బుధవారం కంటి వెలుగు కార్యక్రమాన్ని మాజీ ఎంపీపీ మన్నెపు రెడ్డి, స్థానిక సర్పంచ్ జయంతి శంకర్ నాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ మన్నెపు రెడ్డి మాట్లాడుతూ కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్టాంగా నిర్వహించడం జరిగిందన్నారు. కంటి వెలుగు కార్యక్రమంలో 18 సంవత్సరాలు పైఉన్నవారు ప్రతి ఒక్కరు కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కంటి చూపు బాగుంటే మనం ఏదైనా పని చేసుకోవచ్చు అని అన్నారు. మనుషులకు కంటి చూపు వెలుగులు నింపడానికే ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందన్నారు. కన్ను బాగుంటే ప్రపంచాన్ని చూడొచ్చని అన్నారు.ఇంటిలో ఉన్న వృద్ధులకు కంటి చూపు చూయించి పరీక్షలు నిర్వహించి కళ్లజోడు తీసుకోవాలని అన్నారు. ప్రభుత్వం ముందుచూపుతోనే కంటి వెలుగు కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని ఈ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ అఫ్జల్, వైద్య సిబ్బంది, ఆశవర్కర్లు, గ్రామ వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా ధ్వజస్థంభ ప్రతిష్ట



**పెబ్బేరు,ఫిబ్రవరి1 ప్రభాతవార్త:** పెబ్బేరు మండలం రంగాపురం గ్రామం లో చింతల వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో ధ్వజస్థంభ ప్రతిష్టాపన, నవగ్రహాల విగ్రహాలు, బొడ్రాళ్ల ప్రతిష్ట కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం4 గంటలకు గర్తపూజ తదనంతరం 4.30 నిమిషాల నుండి 5.10 వరకు ధనుర్లగ్న శుభ పుష్కరాంశమున మహా యంత్రం స్థాపన, బొడ్రాళ్ల ప్రతిష్ట ద్వారాలపాలక, నవగ్రహా, గణపతి, గరుడ, బలిపీఠ, నాగ, గండాదీప, కార్యక్రమాలు నిర్వహించారు. కుంభ నివేదనం, పూర్ణాహుతి కార్యక్రమాలు వేదపండితుల మంత్రోచ్ఛరణ మధ్య మేళతాళాలతో బొడ్రాళ్ల ను గ్రామ పురవీధుల్లో వైభవంగా ఊరేగిస్తూ ప్రతి ష్టాపన కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామస్థులతో పాటు చుట్టుపక్కల గ్రామాల వారు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో భక్తులు విరివిగా పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేశారు. ఆలయ ప్రాంగణం గోవింద నామంతో మారుమోగిందింది. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మెన్ ఎన్,కృష్ణరెడ్డి, బి.రామ చంద్రారెడ్డి, వాసుదేవ్‌రెడ్డి, భరత్ కుమార్‌రెడ్డి, పులెందర్‌రెడ్డి, శంకర రెడ్డి, మాధవరెడ్డి, రమేష్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి,పెద్దింటి చంద్రయ్య, హనుమన్న,చిన్నోడు, భాపన్‌పల్లి రమేష్, కురుమన్న తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య కార్మికుడు కురుమయ్య కుటుంబానికి ఆర్థిక సాయం



**వనపర్తి టౌన్,ఫిబ్రవరి 1 ప్రభాతవార్త:** వనపర్తి మున్సిపాలిటీకి చెందిన మున్సిపల్ పారిశుద్య కార్మికుడు కురుమయ్య మంగళవారం వనపర్తి తాళ్ల చెరువులో అనుమానాస్పదంగా మృతి చెందిన విషయం విదితమే. కురుమయ్య మరణం విషయం తెలుసుకున్న వనపర్తి మున్సిపల్ చైర్మెన్ గట్టు యాదవ్ మృతుని కుటుంబాన్ని పరామర్శించి దహన సంస్కారాల ఖర్చులకు రూ.10వేలు అందజేశారు. కురుమయ్య మృతి దురదృష్టకరమని ఆయన కుటుంబానికి అన్ని విధాలా సహాయ సహకారాలు అందజేస్తామని చైర్మెన్ తెలిపారు. ఆయన వెంట మున్సిపల్ సిబ్బంది సాయిరాం, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మడివేల మాచిదేవ జయంతి



**అయిజ,ఫిబ్రవరి 1 ప్రభాతవార్త:** పట్టణంలో వెలసిన శ్రీ మడివేల మాచి దేవా జయంతి సందర్భంగా రజక సంఘం నాయకులు బుధవారం మడివేల విగ్రహానికి పూలమాలలతో పూలు చేసి ఘనంగా జయంతి వేడు కలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాటాడుతూ మడివేల మాచి దేవా విగ్రహానికి దేవాలయం నిర్మించుకునేందుకై ప్రజా ప్రతినిధులు ప్రభు త్వం తరపున సహాయ సహకారాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ వార్డుమెంబర్ చాకలి వెంకటేష్, వెల్డింగ్ షాపు చాకలి తిమ్మప్ప, పత్తిమిల్లు చాకలి పత్తిమిల్లు నరసింహులు, పత్తిమిల్లు చాకలి తిరు మలేష్, మేస్త్రీ చాకలి కర్రెప్ప, ఈనాడు ఏజెంట్ చాకలి వీరేష్, చాకలి వీరన్న, నాగరాజు పాల్గొన్నారు.

## విద్యకు ప్రాధాన్యత లేని కేంద్ర ప్రభుత్వ బడ్జెట్

**వెల్దండ, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త:** ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యను అందించాలని, బడి పిల్లల భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలనే లక్ష్యంతో సీఎం కేసీఆర్ మన ఊరు – మనబడి, మన బస్తీ – మన బడి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని, ప్రభుత్వ పాఠశాలలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని జెడ్పీచైర్‌పర్సన్ శాంతకుమారి, ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డిలు అన్నారు. వెల్దండ మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో బుధవారం మన ఊరు – మనబడి కార్యక్రమంలో మొదటి విడతలో రూ.26లక్షలతో చేపట్టిన పనులను జెడ్పీ చైర్‌పర్సన్ శాంతకుమారి, ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు, వెల్దండ గ్రామ సర్పంచ్ యెన్నం భూపతిరెడ్డిలతో కలిసి ప్రారంభించారు. మన ఊరు – మనబడి కార్యక్రమంలో భాగంగా చేపట్టిన అధునాతనమైన భవనాలు, బెంచీలను వారు పరిశీలించారు. సర్పంచ్ భూపతిరెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్రం ఏర్పడిన తర్వాత మౌళిక వసతుల కల్పనలో దేశంలోనే తెలంగాణ రాష్ట్రం ముందంజలో ఉందని, విద్యారంగం బలోపేతానికి ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతుందన్నారు. కార్పొరేంట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడానికి రూ.7500కోట్లను వెచ్చించి మౌళిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తుందన్నారు. విద్యార్థులు ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యను అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. రాష్ట్రంలో 1100 రెసిడెన్షియల్ పాఠశాలలను ఏర్పాటు చేసి 6లక్షల మంది విద్యార్థులకు విద్యను అందిస్తున్న ఏకైక ప్రభుత్వం తెలంగాణ అని కొనియాడారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తుంటే... కేంద్ర ప్రభుత్వం నేడుఆర్థిక మంత్రిప్రకటించిన బడ్జెట్‌లో విద్యకు ప్రాధాన్యత లేదని వారు విమర్శించారు. పేద ప్రజల అభ్యున్నతికి కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ నిరాశజనకంగా ఉందన్నారు. జిల్లాలోనే మొట్ట మొదటిగా వెల్దండ మండల కేంద్రంలోని పాఠశాలను ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఈఓ గోవిందరాజులు, ఆర్‌అండ్‌బీ ఈఈ భాస్కర్, ఎంఈఓ శంకర్‌నాయక్, సెక్టోరియల్ అధికారి వెంకటయ్య, వైస్ ఎంపీపీ శాంతిగోపాల్‌నాయక్, ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు బచ్చు రామకృష్ణ, విద్యాకమిటీ చైర్మన్ సత్యం, హెచ్ఎం జయపాల్‌రెడ్డి, అంజయ్య, తిరుపతిభాయి, శ్రీనివాసుగౌడ్, సర్పంచ్‌లు రామకృష్ణ, అంజయ్య, నాయకులు క్యాసారపు వెంకటయ్య, హరికిషన్, రాజశేఖర్, దేవేందర్, ప్రసాద్, కాదూరాం, యాదగిరి,అలీ తో పాటు తదితరులు ఉన్నారు.

## యువకుల అత్యుత్సాహంతో ఘర్షణ

### లాఠీఛార్జి చేసిన పోలీసులు

**గద్వాల టౌన్,ఫిబ్రవరి 1 ప్రభాతవార్త:** జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలో జమ్మిచెడులో ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే మంగళవారం రాత్రి జమ్ములమ్మ దేవతను గుర్రంగడ్డ నుండి గద్వాలకు ఎద్దుల బండి మీద తీసుకువస్తూ గ్రామస్తులు పెద్ద ఎత్తున ఊరేగింపు చేపట్టారు. ఈ సందర్భంగా బుధవారం ఉదయం జమ్మిచెడు స్టేజీ సమీపంలో కొందరు యువకులు అత్యుత్సాహం ప్రదర్శించారు. అమ్మవారిని తీసుకువస్తున్న ఎద్దులబండి ముందు ఇరువర్గాలు తోపులాట చేసుకున్నారు. పరిస్థితి విషమించడంతో పోలీసులు లాఠీచార్జి చేసి పరిస్థితి అదుపులోకి తీసుకువచ్చారు.ఎలాంటిఅవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు అప్రమత్తం అయ్యారు.

## జిల్లా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన జిల్లా ఎస్పీ

**గద్వాల టౌన్,ఫిబ్రవరి 1 ప్రభాతవార్త :** జోగులాంబ గద్వాల జిల్లా నూతన ఎస్పీగా రెండు రోజుల క్రితం బాధ్యతలు స్వీకరించిన జిల్లా ఎస్పీ కె. సృజన తొలిసారిగా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతిని మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. అనంతరం ఇరువురు అధికారులు జిల్లాకు సంబంధించిన పలు అంశాలపై చర్చించారు.

## రేపు జడ్చర్ల ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి పుట్టినరోజు వేడుకలు

- బాదేపల్లి మార్కెట్ యార్డులో రక్తదాన శిబిరం
- రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయండి
- టీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు శ్రీశైలం యాదవ్

**రాజాపూర్,ఫిబ్రవరి 1 ప్రభాతవార్త :** జడ్చర్ల ఎమ్మెల్యే, రాష్ట్రమాజీ మంత్రి డా. చర్లకోల్ల లక్ష్మారెడ్డి పుట్టినరోజు ఫిబ్రవరి 3వ తేదీన సందర్భంగా సిఎన్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గత 18 సంవత్సరాలుగా దిగ్విజయంగా నిర్వహించబడుతున్న మెగా రక్తదాన శిబిరం ఈ సంవత్సరం కూడా జడ్చర్లలోని బాదేపల్లి మార్కెట్ యార్డు (గంజి)లో ఉదయం 9 గం.ల నుండి ప్రారంభించబడుతుందని టిఆర్ఎస్ రాజాపూర్ మండల అధ్యక్షులు మేకల శ్రీశైలం యాదవ్ తెలిపారు. పట్టణ ప్రాంత, మండలాల/ గ్రామాల బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు రక్తదాన శిబిరంలో పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. మరోపక్క జన్మదిన వేడుకలను పురస్కరించుకుని మండల కేంద్రంతో పాటు పలు ప్రాంతాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా ఫ్లెక్సీలు, కటౌట్లను ఏర్పాటు చేస్తున్నారు. బిఆర్ఎస్ పార్టీ యువ నాయకులు చించోడు అభిమన్యురెడ్డి ఆకట్టుకునేలా టోల్‌గేట్ వద్ద భారీ కటౌట్‌ను ఏర్పాటు చేశారు.

## గ్రామీణ అనుభవ కార్యక్రమంపై అవగాహన

**బిజినేపల్లి, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త:** పాలెంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో బుధవారం రావేఫ్ విద్యార్థినులకు గ్రామీణ అనుభవ కార్యక్రమంపై అవగాహన కల్పించినట్లు కెవికె కో ఆర్డినేటర్ డా. ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. అగ్రికల్చర్, హోంసైన్స్ బిఎస్సీ నాలుగో సంవత్సరం విద్యార్థినిలు 4 నెలల పాటు గ్రామీణ ప్రాంతంలోని రైతులతో ప్రత్యక్షంగా పని చేస్తూ సాగు, జీవన విధానంపై అనుభవం పొందుతారని అన్నారు. గ్రామీణ ప్రాంతంలోని ప్రజల జీవన ప్రమాణాలు మెరుగయ్యేలా తమ వంతుగా వారికి అవగాహన కల్పంచాలన్నారు.అలాగే వ్యవసాయంలో ఆధునిక పరిజ్ఞానం, యాంత్రీకరణద్వారా కలిగే లాభాలనువివరించి ఆదిశగావ్యవసాయంలో ఆధునిక పరిజ్ఞానం, యాంత్రీకరణ ద్వారా కలిగే లాభాలను వివరించి ఆదిశగా సాగు చేపట్టేలా ప్రోత్సహించాలని సూచించారు.కెవికె శాస్త్రవేత్తలు డా.రాజశేఖర్, డా. లావణ్య, 51 మంది రావేఫ్ విద్యార్థినిలు పాల్గొన్నారు.

## బావిలో పడి మహిళ మృతి

**లింగాల,ఫిబ్రవరి 1 ప్రభాతవార్త:** బావిలో పడి మహిళ మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని కోమటికుంట గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. గ్రామానికి చెందిన మహ్మద్ నజియా (25) అనే మహిళ గత కొంత కాలంగా మతిస్థిమితం లేకుండా తిరుగుతూ ఉండేదని తెలిపారు. గత మూడు రోజుల క్రితం ఇంట్లో నుంచి వెళ్లి తిరిగి రాలేదని, చుట్టు ఉన్న గ్రామాలను తిరిగిన మహిళా ఆచూకీ తెలియలేదని తెలిపారు. బుధవారం ఉదయం గ్రామ సమీపంలోని ఓ రైతు వ్యవసాయ పొలంలో బావిలోని మోటార్ ఆన్ చేయడానికి వెళ్లగా బావిలో శవం అయి నీటిలో తేలియాడుతూ కనిపించిందని తెలిపారు. మృతురాలికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఈ విషయంపై పోలీసులను సమాచారం అడగగా ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

## అంత్యక్రియలకు ఆర్థిక సాయం అందించిన అభిమన్యురెడ్డి

**రాజాపూర్,ఫిబ్రవరి 1 ప్రభాతవార్త:** బాలానగర్ మండలంలోని చిన్న రేవల్లి గ్రామానికి చెందిన సంగనమోని నర్సింలు మంగళవారం రాత్రి మృతి చెందారు. సంగనమోని నర్సింలు మృతికి సంతాపం తెలిపిన జడ్చర్ల బిఆర్ఎస్ పార్టీ యువనేత చించోడ్ అభిమన్యురెడ్డి అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం బాధిత కుటుంబ సభ్యులకు రూ. 5 వేల ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో చిన్నరేవల్లి సర్పంచ్ బిజ్జుల లక్ష్మి, చంద్రమౌళి, చిన్నరేవల్లి గ్రామ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు టి. రాజు, బిఆర్ఎస్ పార్టీ గ్రామ ఉపాధ్యక్షులు రమేష్, చిన్నరేవల్లి ఉపసర్పంచ్ దండు కృష్ణయ్య, చిన్న రేవల్లి గ్రామ బిఆర్ఎస్ పార్టీ మాజీ అధ్యక్షులు సంగనమోని పాండు, చెన్నకేశవులు, కమ్మరి కృష్ణయ్య, సంగనమోని నర్సింలు పరామర్శించారు.

## వివాహ వేడుకలకు హాజరైన మాజీ ఎమ్మెల్యే

**అలంపూర్,ఫిబ్రవరి 1 ప్రభాతవార్త:** కర్నూల్ జిల్లా కేంద్రంలోని జరిగిన అలంపూర్ నియోజకవర్గంలోని ఇటిక్యాల మండల వల్లూరు గ్రామానికి చెందిన రవిప్రకాష్ కుమారుడు వివాహానికి మాజీ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ నాయకుడు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## బైక్ ప్రమాదానికి గురైన తోటి మిత్రునికి ఆర్థిక సాయం

**లింగాల,ఫిబ్రవరి 1 ప్రభాతవార్త :** బైక్ ప్రమాదానికి గురైన 1993,94 లో చదివిన మిత్రునికి తోటి మిత్రులు ఆర్థిక సహాయం చేసి ఆదుకున్నారు. 19913,94 సంవత్సరంలో చదివిన మిత్రులలో పోల నిరంజన్ బైక్ ప్రమాదానికి గురయ్యాడు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మిత్రుడు త్వరగా కోలుకోవాలని మిత్రులందరు కలిసి బుధవారం రూ. 36,500ల ఆర్థిక సాయం చేసి ఆదుకున్నారు. కార్యక్రమంలో పదవ తరగతి మిత్రులు శేఖర్, మల్లేష్, ముక్తార్,మురళి, గోపినాయక్, హబీబ్, మహబూబ్‌అలీ, అనిల్, యాదిరెడ్డి, దశరథం,రమేష్ వెంకటస్వామి పాల్గొన్నారు.

## రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయండి

- ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి జన్మదినాన్ని ఘనంగా నిర్వహిద్దాం: బాలానగర్ యూత్ వింగ్ అధ్యక్షులు సుప్ప ప్రకాష్

**జడ్చర్ల,ఫిబ్రవరి 1 ప్రభాతవార్త:** ఫిబ్రవరి 3వ తేదీన ప్రియతమ నేత జడ్చర్ల నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత, మాజీ మంత్రి, జడ్చర్ల ఎమ్మెల్యే డా.సి. లక్ష్మారెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేయబోయే మెగా రక్తదాన శిబిరాన్ని జయప్రదం చేయాలని బాలానగర్ బిఆర్ఎస్ పార్టీ యూత్ వింగ్‌అధ్యక్షులు సుప్ప ప్రకాష్ పిలుపునిచ్చారు. ఫిబ్రవరి 3న జరిగే జన్మదినోత్సవ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించేందుకు జడ్చర్ల మండల పార్టీ ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, యువకులు, అభిమానులు అధిక సంఖ్యలో హాజరై అంగరంగ వైభవంగా నిర్వహించాలని కోరారు. ప్రతి ఏడాది మాదిరిగా ఈ ఏడాది కూడా ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి జన్మదినం సందర్భంగా జడ్చర్ల గంజి (మార్కెట్ యార్డు)లో రక్తదాన శిబిరాన్ని భారీ ఎత్తున నిర్వహిస్తున్నారని, మండలంలోని ఆ గ్రామాలకు చెందిన యువకులు, పెద్ద సంఖ్యలో హాజరై రక్తదానం చేయాలని కోరారు. గత 18 సంవత్సరాలుగా రక్తదాన శిబిరం, అదేవిధంగా వివిధసేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలో అన్ని వర్గాల ప్రజలను అభివృద్ధి పథంలో తీసుకెళ్తూ జడ్చర్లను అభివృద్ధి చేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి జన్మదినోత్సవ వేడుకలను జయప్రదం చేయాలని సుప్ప ప్రకాష్ కోరారు. బుధవారం సాయంత్రం జడ్చర్ల పట్టణం వద్ద బ్యానర్లను ఏర్పాటు చేసి యువతకు దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో గుడిసె బాలయ్య, వీరేష్, రాజేందర్‌రెడ్డి, రామకృష్ణ, శ్రీకాంత్, కృష్ణ, నర్సింహ, జగన్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ ప్రభుత్వంలో గ్రామాలకు మహర్దశ

- నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఫిబ్రవరి1 ప్రభాతవార్త:** బీఆర్ఎస్ ప్రభుత్వంలో గ్రామాలకు మహర్దశ చేకూరుతుందని ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి అన్నారు. నాగర్‌కర్నూల్ మండలం శ్రీపురం గ్రామంలో హిందు వైకుంఠ దామాన్ని గ్రామ సర్పంచ్‌తో కలిసి ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ 500 జనాభా ఉన్న తాండాలను గుర్తించి ప్రత్యేక గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేయడమైనది. రాష్ట్రంలో 4వేల కొత్త గ్రామ పంచాయతీలు ఏర్పడ్డాయని, పంచాయతీల్లో ప్రజలకు సరైన వసతులను కల్పించడానికి రాష్ట్ర ప్రభుత్వం అధికమైన నిధులు కేటాయించి నూతనంగా ఏర్పడిన గ్రామాలకు గ్రామ పంచాయతీలతో పాటు ప్రజల సౌకర్యార్థం బీటీ రోడ్లను మంజూరు చేశామన్నారు. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ చేపడుతున్న సంక్షేమ ఫలాలు, పథకాలు గడప గడపకు అందుతున్నాయన్నారు. 76 ఏళ్ల చరిత్రలో తెలంగాణలో ఎన్నడు అమలు కానీ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కేవలం 8 సంవత్సరాల్లో సీఎం కేసీఆర్ చేసి చూపించారని, త్వరలోనే గిరిజనులకు గిరిజన బంధు అందిస్తామన్నారు. భూమి కాస్తులో గిరిజనులకు పోడు భూముల పట్టాలను సీఎం కేసీఆర్ త్వరలో అందించనున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ నరసింహ రెడ్డి, ప్రజా ప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.



హిందు వైకుంఠ దామాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

## ఎంజెఆర్ ట్రస్ట్ ద్వారా పేదలకు సేవ చేయడమే లక్ష్యం : ఎమ్మెల్యే మర్రి



వధువరులకు పట్టు వస్త్రాలను అందజేస్తున్న దృశ్యం

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త:** ఈ నెల 12వ తేదీన నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో ఎంజెఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 220 జంటలకు వైభవోపేతంగా సామూహిక వివాహ మహోత్సవాన్ని నిర్వహిస్తున్నామని ఎంజెఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి అన్నారు. బుధవారం తేజ కన్వెన్షన్‌లో ఎంజెఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి, ఆయన సతీమణి జమున, ట్రస్ట్ డైరెక్టర్ జక్క రఘునందన్‌రెడ్డిలు సామూహిక వివాహాలు నిర్వహించుకునే 220 జంటలకు, వారి తల్లిదండ్రులకు వస్త్రాలు, మేకప్ కిట్లను అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి మాట్లాడుతూ నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలోని పేదింటి ఆడబిడ్డలకు పెద్దన్నలా అండగా నిలుస్తానన్నారు. సామూహిక వివాహాలను దగ్గరుండి అంగరంగా వైభవంగా నిర్వహిస్తామన్నారు. 5 రోజుల పాటు నిర్వహించే మహోత్సవానికి భారీగా తరలివచ్చి పేద జంటలను ఆశీర్వదించాలన్నారు. తన తండ్రి పేరిట ఏర్పాటు చేసిన ట్రస్ట్ ద్వారా 5 పర్యాయాలు సామూహిక వివాహాలు నిర్వహించామని, ఒక పేదింటి ఆడ పిల్ల వివాహం ఎలా జరుగుతుందో అంత వైభవంగా ఈ వివాహ మహోత్సవాన్ని నిర్వహిస్తామన్నారు. 220 ముత్యాల పందిర్లను ఏర్పాటు చేయిస్తున్నామని, నూతన వధువరులకు నాణ్యమైన పట్టు వస్త్రాలను సమర్పించారు. ట్రస్ట్ ద్వారా ఈ ప్రాంత ప్రజలకు సేవ చేసే భాగ్యం దక్కిందన్నారు. తమ ట్రస్ట్ ద్వారా ఏకమవుతున్న జంటలకు ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో అన్ని మండలాలకు చెందిన ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సింగిల్‌విండో అధ్యక్షులు,సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రజా ప్రతినిధులు, నూతన వధువరులు, వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి, పట్టు వస్త్రాల కార్యక్రమానికి హాజరైన నూతన వధువరుల కుటుంబ సభ్యులు

# ప్రభుత్వ పాఠశాలలో కార్పొరేట్ స్థాయిలో విద్యార్థులకు విద్య

### గార్లపాడులో మన ఊరు మనబడిని ప్రారంభించిన జిల్లా కలెక్టర్, జడ్పీ ఛైర్మన్, అలంపూర్ ఎమ్మెల్యే



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి



మాట్లాడుతున్న జడ్పీ ఛైర్‌పర్సన్ సరిత

**ఇటిక్యాల,ఫిబ్రవరి 1 ప్రభాతవార్త:** గ్రామీణ ప్రాంతాలలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో తెలంగాణ ప్రభు త్వ విద్యకోసం ప్రాధాన్యత కల్పించి విద్యార్థులకు సకల వసతులు కల్పించిందని విద్యార్థులు కష్టపడి చదువుకోవాలని మొదటి విడతలో పూర్తయిన పాఠశాలలను ప్రారంభించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి, జడ్పీ ఛైర్‌పర్సన్ సరిత, అలంపూర్ ఎమ్మెల్యే అబ్రహం,జిల్లా విద్యాధికారి సిరా జుద్దిన్ విద్యార్థులకు వివరించారు. తెలంగాణ ప్రభుత్వం పాఠశాలను బలోపేతం చేస్తూ పాఠశాలలకు మౌలిక వసతులు కల్పించేందుకు గాను మన ఊరు మనబడి కింద మొదటి విడతలో మండల పరిధి లోని రాజశ్రీ గార్లపాడు ప్రభుత్వ పాఠశాలకు 41 లక్షల 48 వేల రూపాయలతో చేపట్టిన పనులు పూర్తి కాగా బుధవారం జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి, జడ్పీ ఛైర్‌పర్సన్ సరిత, అలంపూర్ ఎమ్మెల్యే అబ్రహం, జిల్లా విద్యాధికారి సిరాజుద్దీన్, పంచాయతీ రాజ్ ఇంఛార్జి ఈఈ శివకుమార్‌లు హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం పాఠశాలల రూపురేఖలు మారుస్తూ అందులో చదువుకునే విద్యార్థులకు సకల వసతులు కల్పించి నాణ్యమైన విద్యనందించేందుకు ప్రభుత్వం నిధులు విడుదల చేస్తుందని ప్రైవేట్ కార్పోరేట్‌స్థాయి పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలో కూడా అన్ని రకాల సకల వసతులు కల్పించిందని అలాగే విద్యార్థులు కూడా కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. అదేవిధంగా ప్రభుత్వ పాఠశాలలో విద్యాబోధన చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యా ర్థులకు నాణ్యమైన విద్యనందించాలని అలాగే విద్యార్థుల తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపాలని గ్రామ పెద్దలు, పాఠశాల విద్యా కమిటి సభ్యులు, సహాయ సహకారాలు అందిం చాలన్నారు. జిల్లాలో మొదటి కార్యక్రమం రాజశ్రీ గార్లపాడు గ్రామంలో మన ఊరు మనబడి పథకం ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం జడ్పీ ఛైర్‌పర్సన్ సరిత మాట్లాడుతూ 75 ఏళ్ల స్వాతంత్ర భారతదేవంలో ఏ ప్రభుత్వాలు కూడా ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దోహదపడలేదని ముఖ్యమంత్రి కెసిఆర్ 8 ఏళ్లుగా విద్యాభివృద్ధి కోసం కృషి చేస్తున్నారని అలాగే మన ఊరు మనబడి పథకం కింద ప్రభుత్వ పాఠశాలలో సకల వసతులు కల్పించేందుకు లక్షల రూపాయలు ఖర్చు చేస్తున్నా రని వాటిద్వారా విద్యార్థులకు పాఠశాలలో మౌలిక వసతులు కల్పించి ఆహ్లాదకరమైన వాతావరణం కల్పిస్తుందని విద్యార్థులు కూడా ఇష్టపడి చదువుకోవాలని నేటి బాలలే రేపటి పౌరులని బాగా ఉన్నత చదువు చదువుకుని ఉన్నత రంగాలలో రాణించాలన్నారు. కార్పోరేట్ స్థాయిలో ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేస్తూ ముఖ్యమంత్రి కెసిఆర్ చరిత్రలో నిలిచి పోవడం ఖాయమన్నారు. అదేవిధంగా అలంపూర్ ఎమ్మెల్యే అబ్రహం మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ముఖ్యమంత్రి కెసిఆర్ నాయకత్వంలో ఇకనుండి ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు అన్ని రకాల సకల వసతులు ఉంటాయని గ్రామాలలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్న విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. తెలంగాణ ప్రభుత్వం మన ఊరు మనబడి కింద కోట్లాది రూపాయలు వెచ్చించి ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించి తరగతి గదులకు మరమ్మతులు, డిజిటల్ తరగతులు, గ్రీన్ బోర్డు ఏర్పాటు, డైనింగ్ హాల్, బాలుర, బాలికలకు మరుగుదొడ్లు ఏర్పాటు, తరగతి గదులలో విద్యార్థులకు మంచి టేబుళ్లు, లైటింగ్, ప్రహరీగోడ నిర్మాణం,డిజిటల్ తరగతులు వంటివి ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు ఏర్పాటు అయ్యాయని, పవిత్రమైన పాఠశాలల్లో గ్రామాలకు చెందిన వారు మద్యం తాగడం, సీసాలు పగలగొట్టడం వంటివి జరుగుతున్నాయని మా దృష్టికి వచ్చిందని ఇలాంటివి జరగకుండా గ్రామ పెద్దలు పాఠశాల దగ్గర సెక్యూరిటీని ఏర్పాటు చేసుకుని పాఠశాలలను కాపాడాలని ఎమ్మెల్యే అబ్రహం గ్రామస్తులను కోరారు. ఈసందర్భంగా పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య బాగా ఉందని నలుగురే ఉపాధ్యాయులు ఉన్నారని అదనంగా ఉపాధ్యాయులను నియమించాలని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కరెంద్రనాథ్ కలెక్టర్‌ను కోరారు. ఈ సందర్భంగా విద్యార్థులు, కలెక్టర్, జడ్పీ ఛైర్మన్, అలంపూర్ఎమ్మెల్యే, అధికారులు, స్థానికప్రజా ప్రతినిధులను విద్యార్థులు, గ్రామస్తులు ఘనంగాశాలువా,పూలమాలలతోసన్మానించారు. కార్యక్రమంలో ఎంపిడిఓ రాఘవ, తహసిల్దార్ సుబ్రహ్మణ్యం, పంచాయతీ రాజ్ డిఈ సలీం, ఎంఈఓ రాజు, పిఆర్ ఏఈ పాండురంగారావు, ఎంపిఓ భాస్కర్ యాదవ్, ఆర్ఐ ప్రశాంత్‌గౌడ్, స్థానిక సర్పంచ్ పద్మమ్మ, ఎంపిటిసి మల్లేష్, విద్యా కమిటి ఛైర్మన్ ఇస్మాయిల్, భారాసా పార్టీ నాయకులు కురువ పుల్లయ్య, మహేశ్వర్‌రెడ్డి, జయచంద్రారెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, సల్వారెడ్డి, రాముడు, హుసేన్, జగదీశ్వర్‌రెడ్డి, ఈదన్ననాయుడు పాల్గొన్నారు.



మన ఊరు మనబడి శిలాఫలకాన్ని ఆవిష్కరించిన దృశ్యం

## ఎస్సీ రిజర్వేషన్‌ల వర్గీకరణకు చట్టబద్ధత కల్పించడంలో బీజేపీ మోసానికి గుణపాఠం చెబుతాం..!

- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మంద కృష్ణ మాదిగ

**వనపర్తి టౌన్,ఫిబ్రవరి 1 ప్రభాతవార్త:** బీజేపీ పార్టీ చేసిన మోసానికి ప్రధానమంత్రి రాకను నిరసిస్తూ ఈనెల 13న విజయవాడ రహదారి దిగ్బం చేయడం జరుగుతుందని మంద కృష్ణ మాదిగ అన్నారు. బుధవారం రిటైర్డ్ పోస్టల్ డిపార్ట్‌మెంట్ రాష్ట్ర మాదిగ ఉద్యోగ సంఘాల నాయకులు గంధం గట్టయ్య కుమారుని వివాహానికి హాజరైన ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మంద కృష్ణ మాదిగ అనంతరం ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ రాజనగరం రాజేష్ మాదిగ ఆధ్వర్యంలో వనపర్తి జిల్లా కేంద్రంలో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన మంద కృష్ణ మాదిగ మాట్లాడుతూ రాష్ట్రంలో అనాథలను ప్రభుత్వ బిడ్డలుగా గుర్తించి అన్ని విధాలుగా ఆదుకుంటామని ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మంద కృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. కేసీఆర్ ఈ హామీ ఇచ్చా నేటికి 7ఏళ్ల7నెలల 9రోజులు అవుతుందని ఆయన గుర్తు చేశారు. రాష్ట్రంలో తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలు దాదాపు 10లక్షల వరకు ఉన్నారని ఈ విషయంలో కేసీఆర్ మంత్రివర్గం తీసుకున్న ఏ ఒక్క నిర్ణయం కూడా అమలు కాలేదని తెలిపారు. ప్రతి జిల్లాలో మొదటి యాదాద్రిలో రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చి నెరవేర్చలేదని అన్నారు. అనాథల పట్ల కేసీఆర్ మొసలి కన్నీరు కార్చారే తప్ప తీసుకున్న చర్యలు లేవని ఇప్పటి వరకు ఒక్క అనాథ ఆశ్రమాన్ని కూడా ముఖ్యమంత్రి సందర్శించలేదని ఆయన విమర్శించారు. అనాథల సంక్షేమం కోసం ప్రత్యేక చట్టం తీసుకువస్తామని చెప్పి మోసం చేశారని కేసీఆర్ కు చిత్తశుద్ధి ఉంటే ఫిబ్రవరిలో జరిగే అసెంబ్లీ సమావేశాల్లో ఆ హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. వారికి స్మార్ట్ కార్డులు ఇస్తామని మంత్రివర్గ ఉపసంఘం తీసుకున్న నిర్ణయాలు, తీర్మానాలు అమలు చేయలేకపోయారు. ఇప్పటికైనా అనాథలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈనెల 15 నుండి రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల కలెక్టరేట్ల ముందు నిరవధిక దీక్ష చేపడతామని తెలిపారు. అదే విధంగా ఎస్సీ రిజర్వేషన్‌లవర్గీకరణ 1996 నుండి దేశంలో జరిగనటువంటి అనేక ఎన్నికల మేనిఫెస్టోలలో ఎస్సీ రిజర్వేషన్‌ల వర్గీకరణకు మద్దతు తెలుపుతూనే మాదిగలను మోసం చేయడం నేటికి ఎస్సీ రిజర్వేషన్లు వర్గీకరణకు చట్టబద్ధత కల్పించడంలో బీజేపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని యావత్ మాదిగ జాతిని మోసం చేసిందిఎన్‌డీఏ ప్రభుత్వంలో ప్రధాని అభ్యర్థి నరేంద్రమోదీ 2013 సంవత్సరంలో రాష్ట్రానికి వచ్చినప్పుడు మేము కేంద్రంలో అధికారంలోకి వస్తే వర్గీకరణ చేస్తామని హామీ ఇచ్చి రెండు దఫాలుగా అధికారం చేపట్టిన బీజేపీ పార్టీకి భవిష్యత్తులో దేశ వ్యాప్తంగా ఎస్సీ రిజర్వేషన్ ల వర్గీకరణ కోరుకునే ప్రతి ఒక్కరి నుండి గట్టి సమాధానం ఎదురుకోక తప్పదని సమాధానం ఇచ్చారు. ఈ సమావేశంలో సంధ్య కార్తిక్ మాదిగ, మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ము చెన్నకేశవులు మాదిగ, గంధం లక్ష్మయ్య మాదిగ, మంద నపరసింహ మాదిగ, చందాపూర్ రాములు మాదిగ, సువార్తమ్మ మాదిగ, జగదీశ్ మాదిగ, ముప్పారి పురుషోత్తం మాదిగ, గట్టుస్వామి మాదిగ, గంధం లక్ష్మయ్య మాదిగ,మీసాలనాగరాజు మాదిగ, మొకలపల్లి పరుశురాం మాదిగ,, తదితరులు పాల్గొన్నారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మంద కృష్ణ మాదిగ

## సర్వాంగ సుందరంగా సర్కారు బడులు

- పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్వర్‌రెడ్డి

**మహ్మదాబాద్,ఫిబ్రవరి 1 ప్రభాతవార్త :** మహ్మదాబాద్ మండలంలోని చిన్నయపల్లి గ్రామంలో తెలంగాణ ప్రభుత్వం విద్యా వ్యవస్థ బలోపేతం కోసం చేపట్టిన మన ఊరు మనబడి కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్వర్‌రెడ్డి ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మన ఊరు మనబడి కార్యక్రమంతో సర్వాంగ సుందరంగా సర్కారు బడులు సర్కారు బడుల్లో సకల వసతుల కల్పన, స్కూల్ భవనాల మరమ్మతు పనులు, స్కూళ్లకు రంగులు, డిజిటల్ తరగతులు, స్కూల్ లైటింగ్, కంపౌండ్ వాల్, కిచెన్ షెడ్ పాఠశాలల్లో అవసరం మేరకు మన ఊరు మనబడి కార్యక్రమంలో పాఠశాలలు అభివృద్ధి చేయడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి మాధవి, జడ్పీటిసి శ్రీనివాస్‌రెడ్డి, తహసిల్దార్ ఆంజనేయులు, ఎంపిఓ శంకర్‌నాయక్, టిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు బిక్షపతి, గ్రామ సర్పంచ్ మధులత, హనుమంతు, సీనియర్ నాయకులు గోపాల్‌రెడ్డి, సర్పంచ్ వెంకట్రాంరెడ్డి, మండల విద్యాధికారులు, ఉపాధ్యాయులు, మండల టిఆర్ఎస్ పార్టీ నాయకులు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.



## మన హయాంలో చేసిన పలు అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లండి

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఫిబ్రవరి1 ప్రభాతవార్త:** తాను మంత్రిగా, ఎమ్మెల్యేగా కొల్లాపూర్ నియోజ కవర్గంలో చేసిన పలు అభివృద్ధి కార్యక్రమాలను గ్రామ స్థాయిలో ప్రజలకు కార్యకర్తలు వివరించి చైతన్యవంతం చేయాలని మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. బుధవారం పాన్‌గల్ మండల పరిధిలోని చింతకుంట, మల్లాయిపల్లి గ్రామాల్లోని ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో అనేక అభివృద్ధి కార్య క్రమాలకు శ్రీకారం చుట్టి విద్య, వైద్యం,సాగునీరు లాంటి ఎన్నోఅభివృద్ధి కార్యక్రమాలను నియోజకవర్గంలో నిర్వహించామని, అవన్ని కళ్లకు కట్టినట్లు కనబడుతున్న కొంతమంది తప్పుడు ప్రచారం చేస్తున్నారని, వాటిని తిప్పికొట్టేందుకు మనం చేసిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించి చైతన్యవంతం చేయాలని సూచించారు.ప్రతి గ్రామానికి కోట్ల రూ॥ల సీసీ రోడ్లు మంజూరు చేసి అభివృద్ధి చేశామని కానీ నేడు మంజూరు చేసిన నిధులను క్యాన్సల్ చేయించిన ఘనత నేటి పాలకులదని, వీటన్నింటిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని జూపల్లి పిలుపునిచ్చారు. ఆయా గ్రామాల్లో గ్రామ కూడలిలో ఉన్నటువంటి ప్రజలను అప్యాయతతో పలకరించి వారి బాగోగులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మాజీ ప్రజా ప్రతినిధులు,సీనియర్ నాయకులు, కార్యకర్తలు, జూపల్లి యువజన విభాగం నాయకులు ఉన్నారు.

